

teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక



తీన్మార్ మెల్కోల్పు
చట్టం & న్యాయం లపై.....
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో
భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com



ములుగు | సంపుటి: 04 | సంచిక: 293 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | బుధవారం 29 ఏప్రిల్ 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad




## రేవంత్ మూర్ఖత్వం హిట్లర్‌ను మించిపోయింది

- రిటైర్ అయినా వదిలిపెట్టం
- ఐపీఎస్ అధికారులకు హరీశ్ రావు వార్నింగ్
- మన్నె క్రిశాంక్ అరెస్ట్‌పై విరుచుకుపడ్డ హరీశ్ రావు




## పెట్రో ధరల పెంపుపై కేంద్రం క్లారిటీ

- పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు
- వదంతులు నమ్మవద్దు
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత రేట్లు పెరగవు
- ఏప్రిల్ 29న పశ్చిమ బెంగాల్ పోలింగ్ ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయన్న ఊహాగానాలు

# తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్




- ఆగస్టు లేదా సెప్టెంబర్‌లోనే నోటిఫికేషన్..?
- జనగణనతో బిజీగా యంత్రాంగం
- మే, జూన్ నెలల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జన గణన ప్రక్రియ ఎన్నికల ఆలస్యానికి ప్రధాన కారణం
- మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న అశావహులకు మరికొంత కాలం నిరీక్షణ తప్పేలా లేదు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పాలనాపరమైన పరిస్థితులు, కీలకమైన ప్రభుత్వ కార్యక్రమాల దృష్ట్యా జూలై చివరి వరకు ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. మే, జూన్ నెలల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జన గణన ప్రక్రియ ఎన్నికల ఆలస్యానికి ప్రధాన కారణం కానుంది. మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధికార యంత్రాంగం మొత్తం ఈ విధుల్లోనే నిమగ్నమై ఉండటంతో, ప్రస్తుతానికి - మిగతా 2లో




## పార్టీలో ఉంటవా.. పోతవా..?

### మల్లారెడ్డికి కేసీఆర్ ఘాటు హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్)
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొద్దిరోజులుగా మల్లారెడ్డి వ్యవహారశైలిపై పార్టీలో జరుగుతున్న చర్చకు నిన్న తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కీలక సమావేశం - మిగతా 2లో

## లొంగిపోయిన మావోయిస్టులకు ఉద్యోగాలు

- పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో పునరావాసం
- భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు

2



## కొత్త డీజీపీగా సీవీ ఆనంద్

- ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం




హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):
తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా - మిగతా 2లో

## పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు

- చంచల్‌గూడ జైలు నేడు పైలట్ విడుదల
- డ్రగ్స్ కేసులో పైలట్ రోహిత్ రెడ్డికి ఊరట

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):
మొయినాబాద్ ఫాంహౌస్ కేసులో వెలుగుచూసిన డ్రగ్స్ కేసులో పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. మొయినాబాద్ ఫాంహౌస్ కేసులో గత మార్చి 14న రాత్రి తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేయగా.. ఇందులో రోహిత్ రెడ్డికి మాత్రమే బెయిల్ - మిగతా 2లో



# మండిపోతున్న భారతం




- ఢిల్లీ సహా 21 రాష్ట్రాలకు ఎన్హెచ్ఆర్సీ వార్నింగ్
- వడగాల్పుల ముప్పుపై హై అలర్ట్
- రాష్ట్రాలకు ఎన్హెచ్ఆర్సీ కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):
దేశవ్యాప్తంగా ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. సూర్యుడు 45 డిగ్రీల సెల్సియస్ దాటి సుర్రమంటున్నాడు. ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతుండటంతో జాతీయ మానవ హక్కుల కమిషన్ రంగంలోకి దిగింది. వేడి గాలుల తీవ్రత నుంచి ప్రజలను, ముఖ్యంగా బలహీన వర్గాలను కాపాడాలని ఢిల్లీ సహా 21 రాష్ట్రాల ప్రభుత్వాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎండల ప్రభావం వల్ల అణగారిన వర్గాలు, బయట పనిచేసే కూలీలు, వృద్ధులు, చిన్నారులు మరియు నవజాత శిశువుల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతినే అవకాశంయి ఉందని ఎన్హెచ్ఆర్సీ ఎన్హెచ్ఆర్సీ ఆందోళన వ్యక్తం చేసింది. తగినంత ఆశ్రయం, నీరు, వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రాణాపాయం పొంచి ఉందని పేర్కొంది. 2019 నుండి 2023 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 3,712 మంది మరణించారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. తక్షణ చర్యలు: వడగాలుల ప్రభావాన్ని తగ్గించడానికి రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు తక్షణమే చర్యలు చేపట్టాలి.
హీట్ యాక్షన్ ప్లాన్: జాతీయ విపత్తు - మిగతా 2లో



## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

- చర్లపల్లి టెర్మినల్‌పై చర్చ
- యుద్ధ ప్రాతిపదికన రోడ్ల విస్తరణ చేపట్టాలి: కేంద్ర మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):
హైదరాబాద్ నగరంలో ఇప్పటికే ఉన్న సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీని తగ్గించేందుకు కేంద్ర చర్లపల్లి రైల్వే టెర్మినల్ ను భారీ ఎత్తున నిర్మించింది. నగరంలోని రద్దీని తగ్గించేందుకు అత్యంత కీలకమైన ఈ చర్లపల్లి రైల్వే టెర్మినల్, పునరాభివృద్ధి చెందుతున్న - మిగతా 2లో

## బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు



- సొంత వివాదాల్లో కేసీఆర్ కుటుంబం
- వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోడీ
- మహేష్ గౌడ్ ఘాటు వ్యాఖ్యలు

2

# రేవంత్ మూర్ఖత్వం హిట్లర్‌ను మించిపోయింది

**తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని మాజీ మంత్రి ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రేవంత్ సగం కాలం పూర్తయ్యిందని.. ఇంకా మిగిలి ఉన్న సగ కాలమైనా మంచిగా పని చేయాలని హితవుపలికారు. రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యాసంగి పంటకు బోనస్ ఇస్తారా లేదా రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలు ఈ ప్రభుత్వానికి పట్టవా అని నిలదీశారు. జూబ్లీహిల్స్ ప్యాలెస్ ఏసీలో కూర్చుంటే సమస్యలు ఎలా తెలుస్తాయని అన్నారు. 'రేవంత్ మళ్ళీ గెలిచేది లేదు. ఉన్నన్ని రోజులైనా మంచిగా పని చెయ్యి. ఎన్ని కేసులు పెట్టినా ఊరుకునేది లేదు. రైతులు, ప్రజల పక్షాన పోరాడుతూ ఉంటాం' అని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

# మండల స్థాయికి ప్రజావాణి

**హైదరాబాద్**

రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని, తద్వారా వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన మరుసటి రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి (చఖతీజీతీజీలజీనితి) విజయవంతంగా అమలవుతోంది.అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, అప్లికేషన్లు స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల స్వీకరణను నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంసీహెచ్?ఆర్?డీలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సీఎస్ కె. రామకృష్ణారావుతో పాటు సీఎంవో అధికారులను ఆదేశించారు.వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని యోచిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించడంతో పాటు పరిష్కార పురోగతిని ఆ వ్యక్తులకు తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, తద్వారా అప్లికేషన్ పరిష్కారంలో ఆలస్యం జరగకూడదని చెప్పారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని, అప్పుడే ప్రభుత్వం నమ్మకం మరింత పెరుగుతుందన్నారు.ప్రజావాణి ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని సీఎస్, ఉన్నతాధికారుల్ని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టి పారదర్శకంగా అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని అధికారులకు ఆయన సూచించారు.ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిరంతరం సమీక్షలు నిర్వహించాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా చేయాలని సూచించారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే తక్కువ సమయంలోనే పలు సమస్యలు పరిష్కరించే వీలుంటుందని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# వర్క్ ఫ్రమ హోమ్‌కు డిమాండ్

**హైదరాబాద్**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పాటు భారత్‌లోనూ చమురు, గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చమురు కంపెనీలు పెట్రోల్ బంకులకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ నిబంధనలు మార్చడంతో చాలా రాష్ట్రాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి. ఏపీతోపాటు తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేదిస్తోంది. బంకుల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర మవుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.గతంలో కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ఈ సమయంలో ఉద్యోగులకు కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది.పెట్రోల్, డీజిల్ కొరతతో పాటు ఎండలు కూడా మండిపోతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల తరువాత బయటకు వచ్చేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు కోరుతున్నారు.పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైతే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించేందుకు కేంద్రం మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, లాక్ డౌన్ కంటే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి బయటపడంతోపాటు ఎండల నుంచి రక్షణ పొందొచ్చని, మరోవైపు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని, పొల్యూషన్ తగ్గుతుందని పలువురు నెటిజన్లు సూచిస్తున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

## రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి లేఖ

-మొదటిపేజీ తరువాయి

సికింద్రాబాద్ స్టేషన్ల వద్ద అప్రోచ్ రోడ్ల విస్తరణ, భూసేకరణ పనులను తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. ముఖ్యంగా చర్లపల్లి స్టేషన్ అవసరాల దృష్ట్యా ఎఫ్.సి.ఐ గోడౌన్ రోడ్డును 200 అడుగులకు, భరత్ నగర్, ఈసీ నగర్ వైపు ఉన్న రహదారులను 100 అడుగులకు విస్తరించడంతో పాటు, పార్కింగ్ కోసం సుమారు 5.70 ఎకరాల భూమిని కేటాయించాల్సిన అవసరం ఉందని. అలాగే రైల్వే శాఖ ఇప్పటికే నిధులు జమ చేసినందున స్టేషన్‌కు నీటి సరఫరా కనెక్షన్‌ను త్వరగా పూర్తి చేయాలని కిషన్ రెడ్డి తన లేఖలో కోరారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉత్తర టెర్మినల్ వద్ద ప్రయాణికుల రాకపోకలకు వీలుగా ఆల్ఫా హోటల్ నుంచి రథీఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగులకు విస్తరించాలని కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సమస్యలపై పలుమార్లు లేఖల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి గతంలోనే అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కావున నగర రవాణా వ్యవస్థకు ఎంతో కీలకమైన ఈ మౌలిక సదుపాయాల కల్పనపై ముఖ్యమంత్రి వ్యక్తిగతంగా చొరవ చూపి, భూసేకరణ, రోడ్ల విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

## నేడే తెలంగాణ పదో తరగతి ఫలితాలు

**మధ్యాహ్నం 2 గంటలకు విడుదల**

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్)**

తెలంగాణలోని లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 10వ తరగతి ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఏప్రిల్ 29న (బుధవారం) మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ఫలితాలను మే మొదటి వారంలో విడుదల చేస్తారని అందరూ భావించారు. అయితే, విద్యాశాఖ యుద్ధ ప్రాతిపదికన మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేయడంతో నిర్ణీత సమయం కంటే ముందే ఫలితాలు వెలువడనున్నాయి. గాంధీ భవన్‌లోని సీర్ట్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నారు. ఒకవేళ ఏదైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే, ఫలితాలను ఏప్రిల్ 30న విడుదల చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశారు. రేపు మధ్యాహ్నం 2 గంటల తర్వాత వెబ్‌సైట్‌లో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది, కాబట్టి విద్యార్థులు ఓపికతో ఫలితాలను చెక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు

-మొదటిపేజీ తరువాయి

మంజూరు కావడం గమనార్హం. రోహిత్ రెడ్డికి మాత్రమే న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో చంచల్ గూడ జైలు నుంచి పైలట్ రోహిత్ రెడ్డి బుధవారం విడుదల కానున్నారు.
మార్చి 14న రాత్రి మొయినాబాద్‌లో రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో పోలీసులు సోదాలు చేశారు. పార్టీలో డ్రగ్స్, మద్యం తీసుకున్నట్లు గుర్తించారు. పోలీసులపై ఫామ్ హౌస్?లో కాల్పులు జరిపినట్లు మొహినాబాద్ పోలీస్ స్టేషన్ ూ× నయిమ్‌ఉద్దీన్ ఫిర్యాదు చేశారు. వారి నుంచి జర్మనీ తయారీ చెందిన రివాల్వర్?ను స్వాధీనం చేసుకున్నారు. ఒక లైవ్ రౌండ్, నాలుగు ఖాళీ కార్ట్రిడ్జులు సీజ్ చేశారు. పైలట్ రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ దగ్గర నుంచి కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. భారీగా విదేశీ మద్యం బాటిళ్లు, 48 బీర్ బాటిళ్లు, డాన్ జూలియో, రాయల్ సల్యూట్, చీవాస్, బెల్వెడేర్ వోడ్కా సీజ్ చేశారు. పార్టీకి హాజరైన 10 మంది పురుషులు, ఒక మహిళపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

## మండిపోతున్న భారతం

-మొదటిపేజీ తరువాయి

నిర్వహణ అథారిటీ మార్గదర్శకాల ప్రకారం సహాయక చర్యలను అమలు చేయాలి.
ప్రాధాన్యత: ఉపాధి హామీ కూలీలు, నిరాశ్రయులు, ఆరుబయట పనిచేసే కార్మికుల కోసం రక్షణ ఏర్పాట్లు చేయాలి.
నివేదికలు: జిల్లా స్థాయి నుంచి అమలు చేస్తున్న ఏకీకృత కార్యాచరణ నివేదికలను కమిషన్‌కు సమర్పించాలి.
జాబితాలో తెలుగు రాష్ట్రాలు
ఆదేశాలు జారీ చేసిన 21 రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి ప్రముఖ రాష్ట్రాలు ఉన్నాయి. సమీకృత మరియు సమ్మిళిత చర్యల ద్వారా మాత్రమే వడగాలుల ప్రాణనష్టాన్ని అరికట్టగలమని కమిషన్ స్పష్టం చేసింది. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

## పెట్రో ధరల పెంపుపై కేంద్రం క్లారిటీ

**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ ప్రజల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. దీంతో చాలా ప్రాంతాల్లో ప్యానిక్ కొనుగోళ్లు మొదలయ్యాయి. దీంతో బంకుల ముందు వాహనాలు కిలోమీటర్ల మేర క్యూ కట్టాయి. ఇదిలా ఉంటే, పెట్రోల్–డీజిల్ ధరల పెంపుపై కేంద్రం మంగళవారం కీలక ప్రకటన చేసింది. పశ్చిమ ఆసియాలోని పరిణామాలపై జరిగిన విలేకరుల సమావేశంలో పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు అని స్పష్టతనిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో గత రెండు రోజుల నుంచి పానిక్ కొనుగోళ్లు పెరగడంతో వీటిని అదుపు చేసే క్రమంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. వదంతులు నమ్మవద్దని సుజాత శర్మ ప్రజల్ని కోరారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల్ని పెంచే యోచన లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏప్రిల్ 29న పశ్చిమ బెంగాల్ పోలింగ్ ముగిసిన వెంటనే ఇంధన ధరలు పెరుగుతాయన్న ఊహాగానాలను పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ మంగళవారం ఖచ్చితంగా తోసిపుచ్చింది. ఇరాన్ యుద్ధం, మిడిల్ ఈస్ట్ సంక్షోభం నేపథ్యంలో గత రెండు నెలల్లో ముడి చమురు ధర 50 శాతానికి పైగా పెరిగి, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలపై భారీ ఆర్థిక ఒత్తిడి పడుతున్న తరుణంలో కేంద్రం నుంచి ఈ ప్రకటన వచ్చింది.

## తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల నగారా మోగే అవకాశం కనిపించడం లేదు.

**బదిలీల ప్రక్రియ.. విద్యా సంవత్సరం ప్రారంభం**

మరోవైపు, మే 1 నుంచి మే 31 వరకు ఉద్యోగుల బదిలీలపై ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది బదిలీల ప్రక్రియ ఈ నెలంతా కొనసాగనుంది. జూన్ 1 నుంచి విద్యా సంస్థలు పున:ప్రారంభం కానుండటం, అడ్మిషన్ల ప్రక్రియలో ఉపాధ్యాయులు బిజీగా ఉండనుండటంతో ఎన్నికల విధులకు సిబ్బంది కొరత ఏర్పడే అవకాశం ఉంది.

**బీసీ రిజర్వేషన్లే కీలకం**

రాజకీయంగా చూస్తే, ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల ఖరారుకు తాజా జనగణన గణాంకాలను ప్రామాణికంగా తీసుకోవాలని భావిస్తోంది. కులగణన లేదా జనాభా లెక్కింపు పూర్తి కాకుండా నోటిఫికేషన్ ఇస్తే చట్టపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందన్న ఆలోచనలో సర్కార్ ఉంది. ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావడానికి జూలై చివరి వరకు సమయం పట్టవచ్చు. "ప్రస్తుతం మండల, జిల్లా పరిషత్‌లు స్పెషల్ ఆఫీసర్ల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లోనే స్థానిక సమరం మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి." ఎన్నికల కోసం ఇప్పటికే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టిన అశావహులు, తాజా పరిణామాలతో మరికొన్ని నెలలు వేచి చూడక తప్పని పరిస్థితి నెలకొంది.

## పార్టీలో ఉంటవా.. పోతవా..?

-మొదటిపేజీ తరువాయి

వేదికైంది. ఎమ్మెల్యే తీరుపై కేసీఆర్ అందరి ముందే 'క్లాస్' తీసుకోవడం రాజకీయ వర్గాల్లో సంచలనంగా మారింది.

**ఢిల్లీ పర్యటనపై ఆరా**

కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీని కలవడం, అనంతరం ఆయన కోడలు ప్రీతిరెడ్డి నేరుగా రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి వెళ్లి ముఖ్య నేతలతో భేటీ కావడంపై కేసీఆర్ సీరియస్ అయ్యారు. అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ నేతలతో టచ్‌లో ఉండటంపై మల్లారెడ్డిని నిలదీశారు. "పార్టీలో ఉంటవా..? బయటకు పోతవా..?" అని గట్టిగా ప్రశ్నించడంతో మల్లారెడ్డి నీళ్లు నమిలినట్లు తెలిసింది.

**రీల్స్ వద్దు.. బాధ్యతగా ఉండు**

సోషల్ మీడియాలో మల్లారెడ్డి చేసే హడావుడిపై కూడా కేసీఆర్ చురకలు అంటించారు. "సోషల్ మీడియాలో రీల్స్ చేయడం కాదు.. ప్రజా సమస్యలపై పోరాటం చేయాలి. ఒక బాధ్యతగల నాయకుడిలా హుందాగా ప్రవర్తించు.. అంతే తప్ప జోకర్‌లా వ్యవహరించొద్దు" అని ఘాటుగా మందలించారు. నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను గాలికి వదిలేసి, వ్యక్తిగత ప్రచారంపైనే దృష్టి పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**మేడ్చల్ నివేదిక ఎక్కడ..?**

రాష్ట్రవ్యాప్తంగా బూత్ స్థాయి కమిటీల నివేదికలను సమీక్షిస్తున్న తరుణంలో, మేడ్చల్ సెగ్మెంట్ నుండి రిపోర్టు రాకపోవడంపై కేసీఆర్ నిప్పులు చెరిగారు. "మిగతా నియోజకవర్గాల నుండి రిపోర్టులు వస్తుంటే.. మేడ్చల్ నుండి ఎందుకు రాలేదు? అసలు అక్కడ ఏం జరుగుతోంది?" అని ప్రశ్నించారు. గ్రౌండ్ లెవల్‌లో నాయకత్వ సమన్వయం లోపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మల్లారెడ్డి వివరణ**

అధినేత ఆగ్రహానికి గురైన మల్లారెడ్డి చివరకు తన వివరణ ఇచ్చుకున్నారు. తన విద్యా సంస్థలకు ఎదురవుతున్న ఇబ్బందుల వల్లే అధికారులను, ఇతర పార్టీల నేతలను కలవాల్సి వచ్చిందని, ప్రధానిని కలిసింది కేవలం మర్యాదపూర్వకమేనని తెలిపారు. తాను బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.?మల్లారెడ్డికి ఇచ్చిన ఈ స్ట్రాంగ్ వార్నింగ్‌తో పార్టీని ధిక్కరించే నేతలకు కేసీఆర్ గట్టి సంకేతమే పంపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## లొంగిపోయిన మావోయిస్టులకు ఉద్యోగాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):**

లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ముగింపు దశకు చేరుకున్నాయి. పర్యాటక శాఖలో గిరి దర్శక్ గైడ్ల పేరుతో వారికి ఉద్యోగాలు కల్పించింది. వారంతా భద్రాచలం, ములుగు జిల్లాల్లో విధులు నిర్వహించనున్నారు. అందుకోసం వారికి.. నెల రోజులపాటు తెలంగాణ స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ), పర్యాటక శాఖ సంయుక్తంగా శిక్షణ అందించాయి. ఈ శిక్షణ పూర్తి కావడంతో.. వారిని పర్యాటక శాఖలో కొలువుల్లోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు లొంగిపోయి.. జన జీవన స్రవంతిలో కలిసి దేశాభివృద్ధికి పాటుపడాలని కేంద్రం పిలుపునిచ్చింది. అందుకోసం'ఆపరేషన్ కగార్'ను తెరపైకి తీసుకు వచ్చింది. లొంగిపోయిన మావోయిస్టులకు నగదుతోపాటు పునరావాసం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం.. లొంగిపోయిన వారికి గిరి దర్శక్ గైడ్లుగా పర్యాటక శాఖలో ఉద్యోగాలు కల్పించింది.

## కొత్త డీజీపీగా సీవీ ఆనంద్

-మొదటిపేజీ తరువాయి

ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఏప్రిల్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్ల జాబితాను ఇటీవల యూపీఎస్సీ.. రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.

## బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు

**హైదరాబాద్, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్):**

దేశ స్వాతంత్ర్య పోరాటం నుండి నేటి వరకు సేవదళ్ అప్రతిహతంగా తన సేవలను కొనసాగిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. గాంధీ భవన్‌లో జరిగిన సేవదళ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై, రాష్ట్రంలోని బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేంద్రంలో ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణిని సేవదళ్ ఎండగడుతుందని ఆయన పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం దేశంలోని స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. దేశంలో రాజ్యాంగ విలువల రక్షణకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్, నేడు తన కూతురు కవిత అడిగే ప్రశ్నలకే సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని మహేష్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. ప్రస్తుతం కేసీఆర్ కుటుంబం సొంత వివాదాలతో సతమతమవుతోందని, వారు ప్రజల సమస్యల గురించి కాకుండా కేవలం పదవుల కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. పదేళ్లపాటు బీఆర్ఎస్‌ను ఆదరించిన ప్రజలు, ఇప్పుడు ఆ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని.. తెలంగాణలో బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ఈ ఘనత (క్రెడిట్) అంతా సోనియా గాంధీకే దక్కుతుందని ఆయన పునరుద్ఘాటించారు. "తెలంగాణ కోసం సోనియా గాంధీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే.. కేసీఆర్ తన పాలనతో రాష్ట్రాన్ని 50 ఏళ్లు వెనక్కి నెట్టారు" అని మండిపడ్డారు. తెలంగాణ పునర్నిర్మాణం కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# సిక్కిం అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంది

సిక్కిం పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. సిక్కిం అభివృద్ధిని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అడ్డుకున్నాయని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి మళ్లీ పుంజుకుందని అన్నారు. మతం, రాజకీయాల పేరుతో దేశాన్ని విడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో హిమాలయ రాష్ట్రమైన సిక్కిం జాతి ఐక్యతను సగర్వంగా చాటిచెబుతోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'ఏక్ భారత్ - శ్రేష్ఠ్ భారత్' స్ఫూర్తిని సిక్కిం అద్భుతంగా ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. సిక్కిం రాష్ట్ర ఆవిర్భావించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు సాధిస్తున్న అభివృద్ధి చాలా ముందే సాధ్యమయ్యేది. కానీ వరుసగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు సిక్కిం అభివృద్ధిని అడ్డుకున్నాయి. అభివృద్ధి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశాయి. సివోక్-రాంగ్పో రైల్వే ప్రాజెక్టు 2008-09లోనే ఆమోదం లభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదు. కేవలం పేపర్ మీదనే పనులు జరిగాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జోరందుకుంది. తొలిసారిగా సిక్కింకు రైలు రాబోతోంది' అని ప్రధాని మోదీ అన్నారు.



**ఈశాన్య రాష్ట్రాలు దేశానికే అష్టలక్ష్మి : మోదీ**

సిక్కిం, ఈశాన్య ప్రాంతం మన దేశానికి ముఖ్య భాగాలే కాదని, అవి అష్టలక్ష్మి లాంటివి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యాక్ట్ ఈస్ట్ పాలసీతో పాటు, ఈశాన్య ప్రాంత అభివృద్ధికి యాక్ట్ ఫాస్ట్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. వివిధ రంగాలకు చెందిన 30కి పైగా ప్రాజెక్టులను ప్రారంభించినట్లు తెలిపారు. సిక్కింలో కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందనట్టు చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పన ద్వారా సిక్కింకు దేశంలోని ఇతర ప్రాంతాలతో మరింత సులభమైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. సిక్కిం సహా ఈశాన్య రాష్ట్రాలన్నీ భవిష్యత్ వృద్ధికి, సుస్థిర అభివృద్ధికి కేంద్రాలుగా మారనున్నాయని ప్రధాని ఉద్ఘాటించారు.

**'పర్యాటక రంగమే సిక్కిం బలం'**

సిక్కిం ఆర్థిక వృద్ధికి పర్యాటక రంగమే కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'దేశ మొత్తం విస్తీర్ణంలో 1 శాతం కూడా లేని సిక్కింలో, 25 శాతం వృక్ష జాతులు ఉన్నాయి. 500కు పైగా పక్షుల జాతులు, 700కు పైగా సీతాకోకచిలుకలు, అరణ్య సంపద, అలాగే కాంచెంజుంగా పర్వత మహిమ సిక్కింను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. ప్రకృతి సౌందర్యం వల్ల పర్యటకులు మళ్లీ మళ్లీ రావాలనుకునే రాష్ట్రంగా సిక్కిం నిలుస్తోంది. రాష్ట్రంలోని రోడ్ల పరిశుభ్రత, గాలి స్వచ్ఛత చూస్తుంటే, ఇక్కడి ప్రజలు ప్రకృతి పరిరక్షణకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు అని స్పష్టమవుతోంది. నేను ఆర్కిడేరియంను సందర్శించా. అక్కడ చాలా సమయం గడిపాను. ప్రకృతి ప్రేమికులైన పర్యటకులకు నేను చెప్పేది ఆర్కిడ్లను చూడకపోతే, వారు ఏమీ చూడనట్లే. ఈ సంవత్సరం సిక్కిం అన్ని పర్యాటక రికార్డులను బద్దలు కొడుతుందని నేను విశ్వసిస్తున్నా' అని ప్రధాని మోదీ తెలిపారు.

**పలు కీలక ప్రాజెక్టులు ప్రారంభం**

సిక్కిం రాష్ట్ర స్థాపన వేడుకల ముగింపు సందర్భంగా రూ.4వేల కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించారు. ఈ ముగింపు వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ముఖ్యంగా భారత పటం ఆకారంలో పలువురు కళాకారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. సిక్కింలో మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ విద్య, విద్యుత్, పట్టణాభివృద్ధి, పర్యావరణం, పర్యాటకం, వ్యవసాయం వంటి విస్తృత రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులున్నాయి.

# డిజిటల్ అరెస్టు మోసాలకు కేంద్రం చెక్?

దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు కేంద్రం నడుంబిగించింది. ఇందుకోసం పలు నిబంధనలు ప్రతిపాదించి, తాజాగా దానికి సంబంధించిన ఓ నివేదికను అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. డిజిటల్ అరెస్టు మోసాల కట్టడికి బయోమెట్రిక్ సిమ్ వెరిఫికేషన్, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నిలిపివేత మొదలైన చర్యలు చేపట్టనున్నట్లు అందులో పేర్కొంది.

డిజిటల్ అరెస్ట్ స్కామ్‌ల ముప్పును ఎదుర్కొనేందుకు టెలికాం నియంత్రణ సంస్థలు, సర్వీస్ ప్రొవైడర్లు, ఆర్‌బీఐ, టెక్ సంస్థలు, సీబీఐ సహకారంతో పలు చర్యలు చేపట్టినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇందులో భాగంగా డిజిటల్ అరెస్టు మోసాలకు, నేరాలకు పాల్పడుతున్న 9,400 వాట్సాప్ ఖాతాలను నిషేధించినట్లు వెల్లడించింది. వాస్తవానికి దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టు కేసులను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఫిబ్రవరి 9న ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (14సీ) ఒక సమగ్ర నివేదికను రూపొందించింది.

**సుమోటోగా విచారణ**

సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం డిజిటల్ అరెస్టులతో సహా ఆన్‌లైన్ మోసాలపై సుమోటోగా విచారణ చేపట్టింది. డిజిటల్ అరెస్టు కేసుల్లో నష్టపోయిన వారికి తగు పరిహారం అందించేందుకు ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని, ఇందుకోసం ఆర్‌బీఐ, టెలికమ్యునికేషన్ విభాగం, ఇతర సంస్థలను సంయుక్తంగా సమావేశం నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే అటార్నీ



జనరల్ ఆర్?.వెంకటరమణి ప్రభుత్వం తరఫున తాజా నివేదికను సుప్రీం కోర్టు ముందు దాఖలు చేశారు. ఇందులో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వాట్సాప్‌పై తీసుకున్న చర్యలను వివరించారు.

"ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, డీవోటీ ఆదేశాల మేరకు, వాట్సాప్? డిజిటల్ అరెస్టు స్కామ్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ స్కామ్‌లపై అత్యంత కఠినమైన పద్ధతులను ఉపయోగించి దర్యాప్తు నిర్వహించింది. ముందుగా 'సీడ్ సిగ్నల్స్ గుర్తించడం ౧ నెట్‌వర్క్‌లను మ్యాప్ చేయడం ౧ మొత్తం నెట్‌వర్క్‌పై చర్యలు తీసుకోవడం ౧ ఆటోమేటెడ్ డిఫెన్స్ నిర్మించడం' లాంటి చర్యలు తీసుకుంది. దీని ద్వారా డిజిటల్ అరెస్టులతో ప్రమేయం ఉన్న 9400 ఖాతాలను బ్యాన్ చేసింది" అని సదరు నివేదికలో పేర్కొన్నారు.

**వినియోగదారుల రక్షణ కోసం!**

నివేదిక ప్రకారం, "వినియోగదారుల రక్షణ కోసం వాట్సాప్ పలు ఫీచర్స్‌ను తీసుకొచ్చింది. ముఖ్యంగా ప్రొఫైల్ పిక్చర్‌లలో అధికారిక పోలీసు లేదా ప్రభుత్వ చిహ్నాలను ఉపయోగిస్తున్న ఖాతాలను తొలగించే లోగో డిటెక్షన్ వ్యవస్థలు తీసుకొచ్చింది. కొత్తగా క్రియేట్ చేసిన వాట్సాప్ అకౌంట్ల నుంచి కాల్ వస్తే, యూజర్లను హెచ్చరించే ఫీచర్‌ను వాట్సాప్ తీసుకురానుంది. అలాగే అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వారి ప్రొఫైల్ ఫొటోలు కనిపించకుండా ఆటోమేటిక్‌గా హైడ్ చేసే ప్రక్రియను త్వరలో ప్రవేశపెట్టనుంది. అలాగే ఫోన్‌లో కేవైసీ పూర్తయిన సిమ్ కార్డు ఉంటేనే వాట్సాప్ పనిచేసేలా "సిమ్ బైండింగ్" విధానాన్ని 4 నుంచి 6 నెలల్లో అమలు చేస్తామని వాట్సాప్ తెలిపింది. ఇక అనుమానాస్పద, మోసపూరిత సిమ్ కార్డులను గుర్తించిన 2 నుంచి 3 గంటల్లోనే వాటిని బ్లాక్ చేసేలా చేయడానికి కట్టుబడి ఉన్నట్లు డీవోటీ పేర్కొంది. సిమ్ కార్డుల జారీలో పారదర్శకత కోసం 'బయోమెట్రిక్ ఐడెంటిటీ వెరిఫికేషన్ సిస్టమ్'ను 2026 డిసెంబర్ నాటికి అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రూ.10 కోట్లకు పైగా నష్టం వాటిల్లిన డిజిటల్ అరెస్టు కేసులను సీబీఐ నేరుగా విచారణకు స్వీకరించనుంది. ప్రస్తుతం గుజరాత్, దిల్లీకి చెందిన 3 ప్రధాన కేసులను సీబీఐ రీ-రిజిస్టర్ చేసింది. ఇందులో దిల్లీకి చెందిన ఓ బాధితుడు ఏకంగా రూ.22.92 కోట్లు కోల్పోవడం గమనార్హం. మనీ మ్యూల్ (డబ్బు మళ్లింపు) కార్యకలాపాలను అరికట్టేందుకు అనుమానాస్పద లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేసేలా ఆర్‌బీఐ ఒక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ని సిద్ధం చేసింది. ఈ నివేదికను రికార్డుల్లోకి తీసుకోవాలని హోంశాఖ సుప్రీంకోర్టును కోరింది. అంతేకాదు ప్రభుత్వం ఈ నివేదికలో, టెలికాం నిబంధనలను కఠినతరం చేయాలని, వాట్సాప్ వంటి సంస్థలు తమ హామీలను సకాలంలో నెరవేర్చాలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది.

# రాజకీయాల కోసమే రిజర్వేషన్ బిల్లు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. మహిళలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించిన పాపానికి ఇప్పుడు ప్రధాని మోదీ ఇప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకునే సమయం వచ్చిందని పేర్కంది. లోక్‌సభలో ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేసే విధానంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను ఆమోదించాలనే మోదీ కుటిల ప్రయత్నాన్ని ప్రతిపక్షాలు ఐక్యత వల్ల ఘోరంగా విఫలమైంది. ప్రతిపక్షాలు డిమాండ్? చేస్తున్న పనిని ప్రధాని మోదీ చేయాల్సి సమయం ఆసన్నమైంది. నారీ శక్తి వందన్ అధినియమ్ 2023 అమలుపై స్పష్టత తీసుకురావాలి. ఈ చట్టం ఏప్రిల్ 16, 2026 రాత్రి ఆలస్యంగా నోటిఫై చేశారు. 2029 నుంచి ప్రస్తుత లోక్‌సభ 543 సీట్లతోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యం, అవసరం, తప్పనిసరి' అని జైరాం రమేశ్ తెలిపారు.



**'మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం కాదు'**

ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం కాదని జైరాం రమేశ్ ఆరోపించారు. డిలిమిటేషన్ ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రధాని రాజకీయ రక్షణ కోసం డిలిమిటేషన్‌ను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించారని ఆరోపించారు. మహిళలను రాజకీయ అజెండా కోసం వినియోగించిన తప్పును సరిదిద్దుకుని, వారికి న్యాయం చేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుత లోక్‌సభ సీట్లలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి వర్షాకల సమావేశంలో లేదా అంతకంటే ముందే బిల్లు తీసుకురావాలని కోరారు.

**రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి**

మహిళా రిజర్వేషన్ అమలు కోసం కేంద్రం తీసుకువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఇటీవల లోక్‌సభలో ఓడిపోయింది. 28 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. 2/3 మెజారిటీ కోసం 352 ఓట్లు అవసరమయ్యాయి. ఈ బిల్లులో భాగంగా లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కి పెంచి, 2011 జనగణన ఆధారంగా డిలిమిటేషన్ చేసి, 2029 ఎన్నికలకల్లా మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలలో కూడా సీట్ల సంఖ్య పెంచి 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని భావించింది.

**బాక్సైట్ తవ్వకాల విషయంలో కేంద్రంపై విమర్శలు**

మరోవైపు, ఒడిశాలో బాక్సైట్ తవ్వకాల ప్రాజెక్టు గురించి జరుగుతున్న గిరిజనుల నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని జైరాం రమేశ్ తీవ్రంగా విమర్శించారు. రాయగడ, కళహాండీ జిల్లాల్లోని సిజిమాలి ప్రాంతంలో చేపడుతున్న తవ్వకాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చట్ట విరుద్ధమని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులు పెసా, అటవీ హక్కుల చట్టాల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభావిత గ్రామ సభలు, స్థానిక సమాజాలకు ఉన్న హక్కులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టారని ఆరోపించారు. సిజిమాలి ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యావరణంపై భారీ ప్రభావం చూపే తవ్వకాల ప్రాజెక్టులను చట్టపరమైన రక్షణలను పక్కనబెట్టి బలవంతంగా అమలు చేయడం ఒడిశాకు కొత్త విషయం కాదని అన్నారు. ఇదే పరిస్థితి మళ్లీ కనిపిస్తోందని వ్యాఖ్యనించారు. గిరిజనులపై, ముఖ్యంగా మహిళలపై పోలీసులు అధిక బలప్రయోగం చేశారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఎస్సీ/ఎస్టీ చట్టం-1989 ఉల్లంఘనకు దారితీస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా గిరిజన సమాజానికి చెందిన రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని తెలిపారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి కూడా ఒడిశాకు చెందినవారేనని, ఆయన స్పందించి వెంటనే స్వతంత్ర దర్యాప్తు ఆదేశించాలని కోరారు.

## ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు



ఏప్రిల్ 29న బంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారన్న ఊహాగానాలను కేంద్రం తోసిపుచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రణాళికలు ప్రభుత్వానికి లేవని కేంద్ర ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. "పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు" అని పశ్చిమాసియా పరిణామాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. బుధవారం బంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత రిటైల్ ఇంధన ధరలను పెంచుతారా అన్న ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల కారణంగా గత రెండు నెలల్లో ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో వరుసగా నాలుగో ఏడాది కూడా స్థిరంగా ఉన్నాయి. ముడిసరుకుల ధరలకు, పెట్రోల్? పంపు ధరలకు మధ్య పెరుగుతున్న వ్యత్యాసం ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు భారీ నష్టాలను మిగిల్చింది. కొన్ని అంచనాల ప్రకారం రోజువారీ నష్టం సుమారు రూ. 2,400 కోట్లుగా ఉంది. అయితే, బుధవారం తమిళనాడు, బంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో రాజకీయంగా ఉత్కంఠభరితమైన అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ధరలు తక్షణమే పెరుగుతాయన్న ఊహాగానాలు తలెత్తాయి.

## మే రెండో వారంలో భారత్‌కు ఎస్-400 గగనతల వ్యవస్థలు

రష్యా నుంచి నాల్గో విడత అత్యాధునిక ఎస్-400 గగనతల వ్యవస్థలు భారత్‌కు చేరేందుకు సిద్ధమయ్యాయి. మే రెండో వారంలో భారత్‌కు రష్యా వీటిని డెలివరీ చేయనున్నట్లు రక్షణ వర్గాలు తెలిపాయి. గతవారమే రష్యాలో షిప్పింగ్‌కు సిద్ధంగా ఉన్న ఎస్-400 వ్యవస్థలను భారత వాయుసేన ఉన్నతాధికారులు తనిఖీ చేశారని పేర్కొన్నాయి. పాకిస్థాన్ నుంచి వచ్చే ముప్పును నిర్మూలించేందుకు రాజస్థాన్‌లోని సరిహద్దు వెంబడి వీటిని మోహరించనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ నుంచి వచ్చిన ప్రతీ ముప్పును ఈ ఎస్-400లోని క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో అడ్డుకున్నాయి. అందుకు గుర్తుగా ఆపరేషన్ సిందూర్ వార్షికోత్సవం రోజునే వీటిని భారత్‌కు డెలివరీ చేసేలా అధికారులు ప్రణాళికలు రచించారు.

**మరో ఐదు ఎస్-400లను కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం**

రష్యాతో కుదిరిన ఒప్పందంలో భాగంగా ఐదో, చివరి విడత ఎస్-400లు నవంబర్‌లో భారత్‌కు చేరనున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ మొత్తం 11 దీర్ఘశ్రేణి ఎస్-400 క్షిపణులను ప్రయోగించి, పాక్ యుద్ధవిమానాలు, గగనతల ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, రవాణా విమానాలతో సహా పలు వైమానిక ముప్పులను నిర్వీర్యం చేసినట్లు సమాచారం. అప్పుడు ఇవి ప్రదర్శించిన సామర్థ్యాన్ని చూసిన తర్వాత మరో ఐదు ఎస్-400లను కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వేళ ఎస్-400 అద్భుతంగా పనిచేసింది. ఓ విమానాన్ని ఏకంగా 300 కిలోమీటర్ల అవతల నుంచే ధ్వంసం చేసినట్లు అధికారులు చెప్పారు. వాస్తవానికి ప్రపంచవ్యాప్తంగా గతంలో ఎన్నడూ ఊపరితలంపై నుంచి గగనతల లక్ష్యాన్ని ఛేదించింది లేదు. అంతకు ముందు కూల్చిన లక్ష్యాల్లో 200 కిలోమీటర్ల దూరమే ఇప్పటి వరకు అత్యధికంగా ఉంది. కానీ, ఎస్-400 గగనతల వ్యవస్థలో వాడే నాలుగు రకాల క్షిపణుల్లో 40ఎన్6 రేంజి 400 కిలోమీటర్లు దూరం వెళ్లనుంది. దీనిని ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వాయుసేన పూర్తిస్థాయిలో వినియోగించింది. ఈ వ్యవస్థకు భయపడి పాక్ తమ ఎఫ్-16 ఫైటర్ జెట్లు, చైనా నుంచి కొనుగోలు చేసిన విమానాలను సుదూర ప్రదేశాలకు తరలించిందంటేనే దీని ప్రభావం ఏ మేరకు ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం వాయుసేన ఆధ్వర్యంలో పాక్, చైనా సరిహద్దుల్లో 1.5 రెజిమెంట్ల చొప్పున మోహరించారు.

ఇదిలా ఉండగా, ఐదు ఎస్-400 ట్రయంఫ్ రెజిమెంట్ల విషయంలో భారత్ 2018 అక్టోబర్? 5న రష్యాతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.40వేల కోట్లు. 'కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్' (జూాూాూా) నిబంధనల కింద ఈ ఒప్పందంతో ముందుకు సాగితే అమెరికా ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా హెచ్చరించినప్పటికీ, భారత్ ఏడేళ్ల క్రితమే ూ-400 క్షిపణుల సేకరణ ఒప్పందంపై సంతకం చేసింది. వాస్తవానికి 2024 తొలి అర్ధభాగంలోనే మొత్తం ఐదు ఆర్డర్లను అందజేయాల్సింది. కానీ, ఇప్పటి వరకు మూడు చేరుకోగా, నాలుగో ఆర్డర్? వచ్చే నెలలో, చివరిది నవంబర్? నాటికి ఇవ్వనున్నారు.

**అనేక రక్షణ ప్రాజెక్టుల్లో సహకారం**

సుదీర్ఘకాలంగా వ్యూహాత్మక భాగస్వాములైన భారత్- రష్యాలు అనేక రక్షణ ప్రాజెక్టుల్లో పరస్పరం సహకారం చేసుకుంటున్నాయి. రష్యాకు చెందిన సుఖోయ్-30 ఎంకేఐ, టీ-90 ట్యాంక్‌లు భారత్‌లోనే లైసెన్స్‌డ్ ఉత్పత్తి చేస్తున్నారు. మాస్కో నుంచే మిగ్-29 ఫైటర్ జెట్లు, కమోవ్ హెలీకాప్టర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రమాదిత్యను భారత్? తీసుకుంది. ఏకే-203 రైఫిల్స్, బ్రహ్మోస్ క్షిపణులను భారత్‌లోనే తయారు చేస్తున్నారు.

## యూట్యూబ్ చూసి యువకుడు ఆవిష్కరణ

విద్యుత్ కోతలు అనేవి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎప్పటికీ తీరని సమస్యలు. ముఖ్యంగా ఎడారి, సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఇబ్బంది మరింత తీవ్రంగా ఉంటుంది. అందుకే రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు తన వినూత్న ఆవిష్కరణతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ముందడుగు వేశాడు. చిన్న ఆకారంలో, ఎక్కడైనా అమర్చుకునేందుకు వీలుగా ఉండేలా ఓ 'పోర్టబుల్ విండ్ టర్బైన్'ను రూపొందించాడు. ఇప్పుడు అతడి ఆవిష్కరణ దేశానికే కాకుండా విదేశాల్లోనూ ప్రశంసలు అందుకుంటోంది. బాడ్‌మేర్ జిల్లా సాంఖలీ గ్రామానికి చెందిన దూంగరసింహ్? సోఢా, 2006లో వచ్చిన వరదల సమయంలో విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను దగ్గరగా చూశారు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని సంకల్పించారు. దాంతో అతడు ఓ వినూత్న పరికరాన్ని రూపొందించారు. ఈ పోర్టబుల్ విండ్ టర్బైన్‌ను ఇంటి పైకప్పు, బాల్కనీ లేదా ఎక్కడైనా సులభంగా అమర్చుకునేలా తయారు చేశారు. ఒక కిలోవాట్ సామర్థ్యం గల ఈ టర్బైన్, గాలి బాగా వీస్తే రోజుకు 10 నుంచి 20 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేయగలదని ఆయన తెలిపారు. ఈ టర్బైన్ రోజుకు 10 గంటలు పనిచేస్తే నెలకు సుమారు 300 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉంటుందని దూంగరసింహ్? అన్నారు. ఈ పోర్టబుల్ విండ్ టర్బైన్ ధర రూ.50 వేల నుంచి ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. దీంతో సామాన్యులు, రైతులు, గ్రామీణ కుటుంబాలు సైతం దీన్ని సులభంగా కొనుగోలు చేసి వినియోగించుకోవచ్చని అన్నారు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే దాదాపు 20 సంవత్సరాల పాటు విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. దూంగరసింహ్ పెద్దగా చదువుకోకపోయినా, తన సంకల్పంతోనే ఈ విజయాన్ని సాధించారని ఆయన అన్నారు. యూట్యూబ్ వీడియోలు, విశ్వవిద్యాలయాల పరిశోధన పత్రాలు, స్వీయ ప్రయోగాల ద్వారా ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారని తెలిపారు. ప్రారంభంలో అల్యూమినియం షీట్లు, పాత ఫ్యాన్ బ్లేడ్‌లతో ఓ నమూనాను రూపొందించారని చెప్పారు.

తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

# బంగారం ఆస్తే...

బంగారం కొనుగోలు విషయంలో భారతీయుల ట్రెండ్ మారుతోంది. ఒకప్పుడు బంగారం అంటే అలంకరణ సాధనంగానే చూసేవారు, నగలనే అధికంగా కొనుగోలు చేసేవారు. అయితే, పసిడి ధరలు రికార్డ్ గరిష్ఠాలకు చేరిన క్రమంలో బంగారాన్ని పెట్టుబడిగా పరిగణిస్తున్నారు. బంగారంలో పెట్టుబడి పెడితే అధిక లాభం పొందొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం దేశీయంగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన రెండు లోహాల ధరలు.. ఇప్పుడు క్రమంగా దిగి వస్తున్నాయి. ధరలు తగ్గడం మహిళలకు కొంత ఉపశమనం కలిగించినట్లే. అయితే దేశీయ మార్కెట్లో గత మూడు రోజులుగా బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఏప్రిల్ 28న కూడా స్వల్పంగా తగ్గాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు ఒక్కసారి మాత్రమే పెరిగాయి. అంటే ఇదే మంచి అవకాశంగా చెప్పవచ్చు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెరగడం, క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డ్ స్థాయిలోనే ఉండడం వంటివి బంగారం ధరలు తగ్గేందుకు కారణమవుతున్నట్లు బులియన్ మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ నెలలో 24న బంగారం ధరలు కాస్త పెరిగినట్లు కనిపించినా రికార్డ్ గరిష్ఠాలకు చాలా దూరంగానే ఉన్నాయి2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి చేరినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ముందు ముందు ఇది మరింత పెరగవచ్చు నివేదిక తెలిపింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం ధరలు రికార్డ్ స్థాయికి చేరుకున్నాయి. ఏడాది కాలంలోనే ఊహించని విధంగా పెరిగాయి. ఈ క్రమంలో భారతీయులు బంగారం కొనుగోలు చేసే దృక్పథం మార్చుకుంటున్నారని ప్రముఖ రేటింగ్స్ ఏజెన్సీ కేర్ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో గత ఏడాది 2025లో బంగారాన్ని పెట్టుబడుల కోసం కొనుగోలు చేయడం 40 శాతానికి ఎగబాకినట్లు తెలిపింది. అంతకు ముందు ఏడాది వరకు అది 30 శాతానికి లోపే ఉండాదని, మిగితా 70 శాతం పైన అలంకరణ కోసం బంగారు ఆభరణాలు మాత్రమే కొనుగోలు చేసే వారని పేర్కొంది. అయితే, ధరలు పెరుగుతుండడం వంటి కారణాలతో నగలకు బదులుగా ఆస్తులకు ప్రాధాన్యత ఇస్తూ పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొంది.గత ఏడాదిలో పెట్టుబడుల కోసం మేలిమి బంగారం కొనుగోళ్లు, డిజిటల్ విధానంలో కొనుగోళ్లు అనేవి ఎక్కువగా జరిగాయని కేర్ ఎడ్జ్ నివేదిక పేర్కొంది. బంగారం ఈటీఎఫ్‌ల ద్వారానే ఏకంగా 37.5 టన్నుల బంగారానికి సమానమైన పెట్టుబడులు వచ్చినట్లు తెలిపింది. గత 10 సంవత్సరాల కాలంలో వచ్చిన మొత్తం పెట్టుబడుల కంటే ఇది ఎక్కువగా ఉండడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరం లోనూ మొత్తం బంగారం వినియోగంలో పెట్టుబడుల విలువ 35-40 శాతం వరకు ఉండవచ్చని అంచనా వేసింది. 2026లోనూ బంగారం ధరలు గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగుతాయని కేర్ ఎడ్జ్ డైరెక్టర్ అఖిల్ గోయల్ అంచనా వేశారు.గత ఏడాది 2025లో నగల గిరాకీ, విలువ పరంగా వార్షికంగా 10 శాతం మేర పెరిగి రూ.4.8 లక్షల కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది. అధిక ధరల కారణంగా వినియోగదారులు తేలికైన, తక్కువ క్యారెట్ల ఆభరణాలకు మొగ్గు చూపుతున్నారని, అలాగే ఈ లోహాల అమ్మకాల పరిమాణ 15 శాతం మేర పడిపోయినట్లు నివేదిక వెల్లడించింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో ఆభరణాల పెద్ద వ్యాపారులు 35 శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేయగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో అది 20-25 శాతానికి తగ్గవచ్చని అంచనా వేసిందిఈ ట్రెండ్ భారత్‌కు మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ధోరణి మారుతోందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ తెలిపింది. 2025లో బంగారం పెట్టుబడుల డిమాండ్ 2175 మెట్రిక్ టన్నులకు చేరిందని, అది అంతకు ముందు 2020లోని 1805 టన్నులను మించినట్లు తెలిపింది. ఇందులో ఎక్స్ఛేంచ్ ట్రేండెడ్ ఫండ్స్ వాటానే ఎక్కువగా ఉందని తెలిపింది. అలాగే బంగారు కడ్డీలు, నాణెల కొనుగోలు సైతం పెరిగిందని, అది 12 ఏళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందని తెలిపింది. భారత్‌లోనూ గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు నివేదిక తెలిపింది. 2025 ఒక్క ఏడాదిలోనే 37.5 టన్నులకు సరిపడా పెట్టుబడులు వచ్చాని పేర్కొంది.అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ సుందరవల్లి నారాయణస్వామి అంచనాల ప్రకారం ఆర్‌బీఐ వద్ద సుమారు 800-820 టన్నుల బంగారం ఉంది. అలాగే దేశంలో ఆర్థికంగా వెలికితీయగల బంగారం సుమారు 70-80 టన్నులు మాత్రమే" అని ఆయన చెప్పారు.ఆర్థికంగా వెలికితీయగల బంగారం అంటే ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంతో లాభదాయకంగా తవ్వి తీసుకోగల బంగారం అని అర్థం.భారత్‌లో మంచి నాణ్యత గల బంగారం తక్కువగా ఉంది, కాబట్టి ఇక్కడ మైనింగ్ పోటాపోటీగా ఏమీ జరగదు" అని ప్రొఫెసర్ సుందరవల్లి అంటున్నారు."భారతీయుల దగ్గర చాలా బంగారం ఉంది. ఎంత బంగారం ఉందనే విషయంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అది సాధారణంగా 25 వేల నుంచి 27 వేల టన్నుల వరకు ఉంటుందని భావిస్తున్నారు" అని ఆయన అన్నారు.ఈ అంకెకు ఆధారం ఏంటని అడగ్గా, ఇది చాలా మంది నమ్మే ఒక సాధారణ అంచనా మాత్రమే అని ఆయన అన్నారు."ప్రతిఏటా 600 నుంచి 700 టన్నుల బంగారం దిగుమతి అవుతుండగా, ఎగుమతి చాలా తక్కువ. అందుకే ఈ బంగారం ఇళ్లలో ఉండిపోయింది" అని ఆయన చెప్పారు.భారత్ వద్ద 2026 ఫిబ్రవరి నాటికి అధికారికంగా సుమారు 880 టన్నుల బంగారం ఉన్నట్టు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ పేర్కొంది.ఈ విషయంలో భారత్ ప్రపంచంలో 9వ స్థానంలో ఉంది. దీనికంటే ముందు అమెరికా, జర్మనీ, అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, చైనా, స్విట్జర్లాండ్ ఉన్నాయి.అయితే అధికారిక నిల్వలు భారతదేశపు బంగారు కథలో ఒక భాగం మాత్రమే."మన దగ్గర సుమారు 50 కోట్ల టన్నుల పసిడి ధాతువు (అంటే బంగారం కలిగిన రాయి/మట్టి) ఉంది, కానీ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది" అని థరూర్ తన వ్యాసంలో రాశారు.దేశంలో మొత్తం 518.23 మిలియన్ టన్నుల పసిడి ధాతువు ఉన్నట్టు నేషనల్ మినరల్ ఇన్వెంటరీ చెబుతోంది.అయితే దీనర్థం ఈ పసిడిధాతువునంతటినీ వెలికి తీయడం తేలికైన పని అని కాదు. ఇందులో 494.50 మిలియన్ టన్నుల బంగారం వెలికితీయడం కష్టపమైనది కాగా, 23.72 మిలియన్ టన్నులను మాత్రం రిజర్వ్‌గా పరిగణిస్తారు.రిజర్వ్ అంటే బంగారాన్ని వెలికితీయడం లాభదాయకంగానూ, సులభంగా సాధ్యమయ్యే స్థితి.

# ఇంధన కొరత



ఇరాన్ యుద్ధం మన ఇంట్లోకి, ఇంకా చెప్పాలంటే వంటింట్లోకి వచ్చి అతలాకుతలం చేస్తున్నది. యుద్ధం తీసుకువచ్చిన వంటగ్యాస్ సంక్షోభం ఇంకా వేధిస్తూనే ఉన్నది. వాణిజ్యపరమైన వంటగ్యాస్ కొరత కారణంగా హోస్టళ్లు మూతపడటమో, మెనూను తగ్గించటమో చేశాయి. ఇప్పుడు వాహనాల ఇంధనం సమస్య వీధికెక్కి వీరంగం వేస్తున్నది. నెలరోజుల క్రితం భయాందోళనలతో ప్రజలు అతికొనుగోలుకు పాల్పడటంతో బంకుల వద్ద రద్దీ, నోస్టాక్ బోర్డులు వెలిశాయి. కాలక్రమంగా యుద్ధ తీవ్రతతో పాటు ఇది కూడా కొంత నెమ్మదించింది. కానీ గత మూడు, నాలుగు రోజులుగా మండేఎండలో బంకుల వద్ద ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు కిలోమీటర్ల పొడవునా బారులు తీరుతుండటం కనిపిస్తున్నది. అత్యవసర సేవలందించే అంబులెన్సులు కూడా క్యూలైన్లలో నిలుస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఇలా వాహనాలు పోటెత్తడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తుతున్నది. క్యాబ్ బుకింగుల్లోనూ సమస్యలు తలెత్తుతున్నాయి. అటు గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన కొరత వల్ల సాధారణ రవాణాతోపాటు వ్యవసాయం రంగంపై తీవ్ర ప్రభావం పడుతున్నది. డీజిల్ అందుబాటులో లేకపోవటంతో హార్వెస్టర్ యంత్రాలు పనిచేయటంలేదు. దిగుబడి అయిన ధాన్యాన్ని కాంటాల వద్దకు తరలించటమూ వీలుకావటం లేదు. ఈ పరిస్థితికి యుద్ధం ప్రత్యక్షంగా కారణమా? లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణాలోపం కారణమా? అనేది ప్రశ్న. వాహనదారులు బంకులకు పరుగులు తీయటానికి ఇంధనం కొరత, ధరల పెరుగుదలపై సోషల్ మీడియాలో పోటెత్తుతున్న వదంతులు కారణమవుతున్నాయనేది తెలిసిందే. నిల్వలున్నాయని, సరఫరాకు ఎలాంటి ఢోకా లేదని ఇటు రాష్ట్ర పౌర సరఫరా విభాగం గానీ, అటు కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలోని చమురు కంపెనీలు ప్రకటించి చేతులు దులిపేసుకుంటున్నాయి. అయితే, వీరి ప్రకటనలకు భిన్నంగా అనేక బంకులు దగ్గర నోస్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడా తెరచి ఉన్న బంకుల వద్ద విపరీతమైన రద్దీ ఉండటం చూస్తే పరిస్థితి అంత సవ్యంగా ఏమీ లేదని సూచిస్తున్నది. చమురు కంపెనీలు అనుసరిస్తున్న క్రెడిట్ విధానం ఇంధన సరఫరాతో చెలగాటమాడుతున్నదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. యుద్ధం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరుగుతున్నాయి. దాంతో మనదేశంలోనూ వాహన ఇంధనాల ధరలు పెంచక తప్పని పరిస్థితి ఎదురవుతున్నది. కానీ ప్రస్తుతం జరుగుతున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రస్తుతానికి ఆ జోలికి వెళ్లటం లేదు. కానీ, ఈ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ధరలు పెరగడం మాత్రం ఖాయంగా కనిపిస్తున్నది. ఈలోగా కంపెనీలు ఎంత చమురు అమ్మితే అంత నష్టం అనే ధోరణిలో సరఫరాను కృత్రిమంగా నియంత్రిస్తున్నాయి. ముందస్తుగా డబ్బు చెల్లిస్తేనే ట్యాంకర్ కదులుతుంది అనే విధానం అమలు చేస్తున్నాయి. కొన్ని బంకుల యాజమాన్యాలు రెండేసి ట్యాంకర్ల కోసం డబ్బులు కట్టినా కేవలం ఒక్క ట్యాంకర్‌నే పంపడం వంటివి కృత్రిమ నియంత్రణవైపే వేలెత్తి చూపిస్తున్నది. అటు ధరల విషయంలో కేంద్రం, ఇటు సరఫరా విషయంలో చమురు కంపెనీలు ఆడుతున్న నాటకం సామాన్యులకు సంకటంగా మారింది. 2016లో పెద్దనోట్ల రద్దుతో బ్యాంకుల వద్ద ప్రజలు క్యూలు కట్టాల్సి వచ్చింది. వారాల తరబడి నగదు లేని పరిస్థితి. 2017లో జీఎస్టీ తిప్పలు మొదలయ్యాయి. ఇంధన ధరలు తగ్గించవచ్చని అధికారంలో లేనప్పుడు హంగామా చేసిన బీజేపీ పాలనలో 2018-23 మధ్యకాలంలో ఇంధన ధరలు తారస్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా అన్ని రంగాలపై దీని ప్రభావం పడింది. ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలిపినా కేంద్రం మనసు కరుగలేదు. 2020-21 మధ్యకాలంలో మోదీ సర్కార్ వ్యవసాయరంగంలో నల్లచట్టాలను ప్రవేశపెట్టింది. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతుల నిరసనలతో దేశం దద్దరిల్లింది. 2022లో రైల్వే రిక్రూట్‌మెంట్ నిరసనలతో బీహార్, యూపీ రాష్ట్రాలు అట్టుడికాయి. అదే ఏడాది ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ స్కీంకు నిరసనగా యువజనులు చేపట్టిన పోరు హింసాత్మకంగా మారింది. ఇక కరోనా కల్లోలంలో ప్రజలను సిద్ధం చేయకుండా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా రాత్రికిరాత్రే ప్రకటించిన లాక్‌డౌన్‌తో, ప్రజలు..ముఖ్యంగా వలస కూలీలు అనుభవించిన నరకం ఈ దేశం ఎప్పటికీ మరిచిపోదు. ఇక వ్యాక్సిన్ కొరత వల్ల ఎదుర్కొన్న సమస్యలది వేరే కథ. ఇప్పుడు చమురు సరఫరాలో అసమర్థత, అవతకతవకలు వచ్చిచేరాయి. అమెరికా హుకూంలన్నిటికీ తలొగ్గుతున్న మోదీ సర్కార్ దేశానికి సరిపడా ఇంధనం ఎందుకు తేలేకపోయింది? తానే టాంటాం వేసినట్టుగా తగ్గింపు ధరలకు ఎందుకు ఇవ్వలేకపోతున్నది? ఇవీ ప్రజల మనసుల్లో మెదులుతున్న ప్రశ్నలు.

# జల వివక్షపై ఎలుగెత్తి చాటిన గళం

తెలంగాణ చారిత్రక ప్రస్థానంలో నీరు ప్రకృతి వనరు మాత్రమే కాదు; అది ఈ గడ్డ ఆత్మాభిమానం, అస్తిత్వం, కోట్లాదిమంది రైతుల జీవన్మరణ సమస్య. వలస పాలకుల స్వార్థపూరిత పాలనలో దశాబ్దాల పాటు సాగిన జలదోపిడీ, ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన అంకెల గారడీ, సాంకేతిక కుట్రలను శాస్త్రీయంగా ఛేదించి తెలంగాణ సమాజాన్ని నిద్రాణస్థితి నుంచి మేల్కొల్పిన అపర భగీరథుడు ఆర్.విద్యాసాగర్‌రావు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా సాగునీటి రంగంలో సాగించిన అలుపెరగని పోరాటం, మలిదశ ఉద్యమానికి ఆయన అందించిన మేధోసంపత్తిని విశ్లేషించుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ కనీస బాధ్యత. 1939 నవంబర్ 14న నల్గొండ జిల్లా, జాజిరెడ్డిగూడెంలో లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యాసాగర్‌రావు జన్మించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న ఆయన తండ్రి రాఘవరావు ఆ గ్రామంలో మెట్రిక్యులేషన్ పూర్తి చేసిన తొలి వ్యక్తి కావడం, వారి కుటుంబంలో చదువుకు ఉన్న ప్రాధాన్యత, విద్యాసాగర్‌రావు ఎదుగుదలకు బలమైన పునాది వేసింది. ఆ గ్రామం నుంచి మొట్టమొదటి ఇంజినీరింగ్ పట్టభద్రుడిగా నిలిచిన ఆయన, 1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందారు. 1979లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుత ఐఐటీ రూర్కీ) నుంచి జలవనరుల అభివృద్ధిలో మాస్టర్స్ డిగ్రీ సాధించారు. 1983లో అమెరికాలోని కొలరాడో స్టేట్ యూనివర్సిటీ నుంచి వాటర్ రిసోర్స్ సిస్టమ్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా పొందారు. 1990లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర పట్టా పుచ్చుకోవడం ఆయన మేధోపటిమకు నిదర్శనం. ఈ అసాధారణ విద్యా నేపథ్యమే అంతర్రాష్ట్ర జల వివాదాలు, ట్రిబ్యునల్ తీర్పులను చట్టబద్ధంగా, సాంకేతిక కోణంలో విశ్లేషించే తిరుగులేని శక్తిని ఆయనకు ప్రసాదించింది. 34 ఏండ్లపాటు కేంద్ర జల సంఘంలో చీఫ్ ఇంజినీర్ వంటి అత్యున్నత హోదాల్లో పనిచేసిన విద్యాసాగర్‌రావుకు దేశవ్యాప్త నదీ పరీవాహక ప్రాంతాల గమనశీలత, నీటి కేటాయింపుల సూత్రాలపై అపార అవగాహన ఉండేది. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న కాలంలోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలో ఏవిధంగా పకడ్బందీగా కోత విధిస్తున్నారో ఆయన నిశితంగా గమనించారు. ఉద్యోగ విరమణ అనంతరం విద్యాసాగర్‌రావు తన శేషజీవితాన్ని తెలంగాణ జలహక్కుల పోరాటానికే అంకితం చేశారు. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రధాన జలవనరుల సలహాదారుగా ఉంటూ, ప్రతి ప్రాజెక్టు రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమకాలంలో కేసీఆర్ చేసే ప్రసంగాల్లోని జల గణాంకాల వెనుక విద్యాసాగర్‌రావు మేధస్సు దాగి ఉండేది. ప్రాజెక్టుల రీ-డిజైనింగ్, నీటి కేటాయింపుల విషయంలో ఆయన సలహాలు ఉద్యమ నాయకత్వానికి దిక్సూచిలా పనిచేసేవి. అందుకే కేసీఆర్ ఆయనను 'జయశంకర్ సార్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప మహానుభావుడు' అని సగర్వంగా కొనియాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా జయశంకర్ దిశానిర్దేశం చేస్తే, సాగునీటి రంగంలో జరుగుతున్న అన్యాయాలను ప్రజల కండ్లకు కట్టినట్లు చూపిన ఘనత విద్యాసాగర్‌రావుకే దక్కుతుంది.'నీళు-నిజాలు' పేరుతో ఆయన రాసిన వ్యాసాలు తెలంగాణ ప్రజల కండ్లు తెరిపించాయి. పత్రికల్లో ఆయన విశ్లేషణలు చదివిన సామాన్య రైతుకు కూడా తన నీటి హక్కుల పట్ల స్పష్టమైన అవగాహన ఏర్పడింది. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల వెనుక విద్యాసాగర్‌రావు మార్గదర్శకత్వం ఉన్నది. ముఖ్యంగా 'మిషన్ కాకతీయ' ద్వారా గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ జరుగాలని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఆయన బలంగా విశ్వసించేవారు. కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, ప్రాజెక్టుల ఎత్తు, నీటి లభ్యత వంటి అంశాల్లో ఆయన సూచనలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఐక్యరాజ్యసమితి ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యుడిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన విద్యాసాగర్‌రావు, మన దేశ 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలోనూ విలువైన సలహాలు అందించారు. 2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆయనను 'లీడింగ్ ఇంజినీరింగ్ పర్సనాలిటీ ఆఫ్ ఇండియా'గా గౌరవించటం వృత్తి పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. 2016 నవంబర్‌లో వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో ఒక సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగం భవిష్యత్తు అంతా సాగునీటి ప్రాజెక్టుల విజయవంతంపైనే ఆధారపడి ఉన్నదని స్పష్టం చేశారు. కొంతకాలం అనారోగ్యంతో బాధపడి 2017 ఏప్రిల్ 29న విద్యాసాగర్‌రావు తుదిశ్వాస విడిచారు. ఆయన వదిలిన మేధోసంపత్తి తెలంగాణకు ఎప్పటికీ రక్షాకవచమే. తెలంగాణ ప్రతి ఎకరానికి నీరు అందించాలన్న ఆయన కల సాకారమవుతుండటం ఆయనకు నిజమైన నివాళి. సాగునీటి అన్యాయంపై ఆయన ఎలుగెత్తి చాటిన గళం, తెలంగాణ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతుంది. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరుపుకోవటం అంటే కేవలం ఒక వ్యక్తిని స్మరించుకోవటం కాదు, తెలంగాణ జల సార్వభౌమాధికారం కోసం పోరాడతామని ప్రతిజ్ఞ చేయటమే.

# ఫిరాయింపులు... ప్రశ్నలు!

ఆప్ నుంచి నిష్క్రమించిన ఏడుగురు రాజ్యసభ సభ్యులతో ఏర్పడిన ఎంపీల బృందం బీజేపీలో విలీనం కావడాన్ని గుర్తిస్తూ రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ నిర్ణయం తీసుకోవటంతో ఫిరాయింపుల చట్టం ప్రహసనప్రాయమని మరోసారి తేలిపోయింది. బహుశా ఎన్నికల ముంగిట్లోవున్న పంజాబ్‌లో రేపో మాపో ఆప్ ప్రభుత్వానికీ ఇలాంటి గండం తప్పకపోవచ్చు. ఆప్ పుట్టుక, ఎదుగుదల భిన్నమైనవి. 2011--12 మధ్య దేశంలో హోరెత్తిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అగ్రభాగాన నిలిచిన కొద్దిమంది రాజకీయేతర నేతల్లో కేజ్రీవాల్ ఒకరు. ఆయన మాదిరే పూర్వాశ్రమంలో ఉన్నతోద్యోగ వర్గంలో, భిన్న సామాజిక రంగాల్లో పనిచేసి కొన్ని ఆదర్శాలు నమ్మి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఆదర్శాల్లో పుట్టి, వైవిధ్యాలతో ఎదిగి, స్వల్పకాలంలోనే మధ్యతరగతిలో పాతుకుపోయిన ఆ పార్టీ అచిరకాలంలోనే సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ సారథుల్లో భిన్నాంశాలపై అప్పటికే ఉన్న మౌలిక విభేదాలు పలు నిష్క్రమణలకు దారితీశాయి. శాంతి భూషణ్, ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్, అడ్మిరల్ రాందాస్ వంటి లబ్ధప్రతిష్టులైనవారిని కీలక పదవులనుంచి తప్పించారు. కొందరు వారికై వారు తప్పుకున్నారు. అటు తర్వాత మధ్యలో అడపా దడపా ఒకరిద్దరు నేతలు నిష్క్రమించినా ఇప్పుడు రాఘవ్ చడ్డా కొట్టిన దెబ్బ సామాన్యమైనది కాదు. ఒక సమస్య విషయంలో పార్టీ వైఖరితో ఏకీభావం లేనప్పుడూ, దాని సిద్ధాంతాలు దారితప్పుతున్నాయనుకున్నప్పుడూ బయటకుపోతే ఎవరూ తప్పుబట్టరు. కానీ పెద్ద మాటలు మాట్లాడుతూ, గంభీరమైన ఉపన్యాసాలిస్తూ కాస్తయినా నైతికత పాటించాలన్న స్పృహ లేనివారిని జనం చీదరించుకుంటారు. ఒక సాధారణ గుమాస్తా సంస్థ నుంచి తప్పుకుంటే మూణ్ణెల్ల నోటీసు ఇవ్వాలన్న నిబంధన ఉంటుంది. లేకుంటే సంస్థలు వాటి పద్ధతిలో అవి చర్య తీసుకుంటాయి. ప్రజానీకం సమస్యల్ని చర్చిస్తూ వారి సంక్షేమానికీ, భద్రతకూ అవసరమైన చట్టాలు తీసుకొచ్చే కర్తవ్యంలో నిమగ్నమై ఉండాల్సినవారికి మాత్రం ఏ నిబంధనా ఉండొద్దా? వారి ప్రవర్తన నలుగురికీ ఆదర్శప్రాయం కావొద్దా? రాజీవ్ గాంధీ హయాంలో 1985లో ఈ ఫిరాయింపుల జాడ్యాన్ని వదిలిస్తామంటూ 52వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి రాజ్యాంగంలో పదో షెడ్యూల్ చేర్చారు. కానీ అది ఎందుకూ కొరగాకుండా పోయిందని తేలిన చాన్నాళ్ల తర్వాత 2003లో 91వ రాజ్యాంగ సవరణ వచ్చింది. అందులో కేవలం లెజిస్లేచర్ పార్టీలో మూడింట రెండొంతుల మంది తప్పుకుని వేరే పార్టీలో విలీనమైతే సరిపోదనీ, ఆ చీలిక, విలీనం పార్టీ స్థాయిలో కూడా కనబడాలనీ నిర్దేశించింది. దురదృష్టమేమంటే... ఈ ప్రాతిపదికన ఫిరాయింపులు రాజ్యాంగ విరుద్ధమని మన న్యాయస్థానాలు తీర్పులిచ్చిన సందర్భాలు లేవు. ఫిరాయింపు సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని సభాధ్యక్షుల దగ్గర ఫిర్యాదులైతే దాఖలవుతున్నాయి. కానీ వాటిపై వేగంగా నిర్ణయం తీసుకున్న ఉదంతాలు లేవు. సుప్రీంకోర్టు గడువు విధించటంతో తెలంగాణ స్పీకర్ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై ఇటీవల నిర్ణయం తీసుకోక తప్పలేదు. కానీ బీఆర్ఎస్ వినతుల్ని ఆయన తోసిపుచ్చారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ లోక్‌సభలోనూ, ఏపీ అసెంబ్లీలోనూ చేసిన ఫిర్యాదులు తేలకుండానే ఆ సభల పదవీకాలం ముగిసిపోయింది. ఫిరాయించటానికి సృజనాత్మక మార్గాలు ఎంచుకోవటం నేతలకు వెన్నతో పెట్టిన విద్య అయిపోయింది. ఏపీలో ఆ మధ్య వైఎస్సార్ కాంగ్రెస్‌కు చెందిన కొందరు రాజ్యసభ సభ్యులు ఏకంగా అయిదేళ్లకు మించి గడువున్న ఎంపీ పదవులకు కూడా రాజీనామా చేసి పోయారు. ఆ తర్వాత వారిలో కొందరు బీజేపీ, టీడీపీల పంచన 'ఎన్నికయ్యారు'. నైతిక విలువలు లేకపోవటమే పెద్ద అర్హతగా మారిన వర్తమానంలో ఇలాంటి వెర్రిమొర్రి పోకడలు కనబడటం వింతేం కాదు. రాఘవ్ చడ్డా నిష్క్రమించదల్చుకున్నప్పటి నుంచీ మధ్యతరగతి పెను సమస్యలుగా భావించేవాటిని సభలో ప్రస్తావించటం, వాటిల్లో కొత్తేం లేకపోయినా అవి వైరల్ కావటం వెనకున్న సారాంశం చాలామంది గ్రహించకపోలేదు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలి

**తాగునీటి సరఫరా మెరుగ్గా ఉండాలి**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతం కావాలి**

**ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి**

**రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హనుమకొండ, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 29 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు గురించి సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఎదురవుతున్న సమస్యలు, తీసుకుంటున్న పరిష్కార చర్యలు, గ్రామాలలో తాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, వాటి పురోగతి, తదితర అంశాలపై మందుతో షాపుల అధికారులతో మంత్రి సమీక్ష చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఏ విధంగా జరిగేది, ప్రస్తుతం ఎలా ధాన్యం కొనుగోలు చేస్తున్నారనే అంశాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు పారదర్శకంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియ గురించి రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు గురించి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అక్కడ రైతులతో మాట్లాడి అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకునే విధంగా అధికారిని ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మండల వ్యవసాయ అధికారి, ఎంపీవో, ఎంపీడీవో, తహసిల్దార్లు పర్యవేక్షించాలన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్యలు ఎక్కడ కూడా తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. అవసరమైన చోట బావులను అద్దెకు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు కలవకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు. లబ్ధిదారులు నిర్మించుకునే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత రానీయకుండా చూడాలని, సమీప ప్రాంతాల్లో ఇసుక లభించే చోట నుండి ఇంటి నిర్మాణానికి ఇసుక తెచ్చుకునే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. బడి వాటర్ కార్యక్రమానికి తగిన ప్రణాళిక రూపొందించుకొని ముందు కు సాగాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల ప్రాంగణ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండే విధంగా చూడాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నాటికి పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదిత అంచనాలు రూపొందించి అందజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో డ్రాపౌట్స్ లేకుండా లేకుండా చూసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు యాక్షన్ ప్లాన్ ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా పెద్దగా పెరిగే చెట్ల మొక్కలను నాటే విధంగా చూసుకోవాలన్నారు. రోడ్లు, ఇండ్లలో మొక్కలు నాటిందుకు మొక్కలు సిద్ధం చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగు చేసుకునే విధంగా రైతులు కా అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారులకు తెలియజేశారు. ఆయిల్ పామ్ వంటసాగుతో రైతులకు కలిగే లాభాల గురించి తెలియజేయాలన్నారు. ఆర్ అండ్ బి రోడ్లకు సంబంధించి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న పంచాయతీరాజ్ పనులను పూర్తి చేయాలన్నారు. అవసరమైన చోట్ల చెక్ డ్యాములు, ఫీడర్ చానల్స్ నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరా పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజా ప్రతినిధులుగా అధికారులుగా ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రభుత్వ సంస్థల ఏర్పాటు కోసం ప్రభుత్వ స్థలాల జాబితా సిద్ధం చేసి ఉంచాలని తహసిల్దార్ ప్రసాదరావు ఆదేశించారు. 213 మహిళా సంఘాలకు స్టీల్ ప్లేట్స్, గ్లాసులు పిచ్చుమైన వాటి వినియోగించాలన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగం చేయకుండా చూడాలని దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ నిర్దేశిత లక్ష్యాన్ని గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి మాట్లాడుతూ ఎల్కతుర్తి మండలములో మొత్తం 13 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడుతున్నట్లు తెలిపారు. కోనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సంబంధిత రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం తరలింపులో ఇక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వంద శాతం కొనుగోళ్లను చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ రెండు నాటికి అధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేయించే విధంగా గృహ నిర్మాణ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంతాజీ, హనుమకొండ ఆర్టీఓ రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజీద్ అలీ, ఏడిఏ ఆదిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పెట్రోల్ డీజిల్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



మహబూబాబాద్ జిల్లా, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ జిల్లా హెచ్పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ కంపెనీ ప్రతినిధులు, పెట్రోల్, డీజిల్ డీలర్లతో అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి డీజిల్, పెట్రోల్ కొరతపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డీజిల్ ,పెట్రోల్ ,గ్యాస్ ఆయిల్ (ఇంధనాలను) అందించాలని, ప్రస్తుత డిమాండ్ కనుగుణంగా లభ్యతను స్వీకరించి సరఫరా చేయుటలో వేగం పెంచాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తీసుకుంటామని, అధిక ప్రాధాన్యత వ్యవసాయ ఆధారిక వాహనాలు హార్వెస్టింగ్, ట్రాక్టర్ తదితర వాటికి ప్రాముఖ్యత కల్పించి ఇంధనాలు అందించాలని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కంపెనీ ప్రతినిధులు డీలర్లతో నిత్యం మాట్లాడుతూ సమస్యలు రాకుండా ఉత్పత్తులను అందించాలని ఆదేశించారు. పెట్రోల్ బంకులలో డబ్బాలలో డీజిల్ పెట్రోల్ తీసుకు వెళ్లడం రాదని, అవసరం లేకున్నా అధికంగా వినియోగించరాదని, సూచించారు ప్రభుత్వం అత్యంత వేగంగా డీజిల్ పెట్రోల్ సరఫరాకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. పెట్రోల్ పంపుల వద్ద ఎలాంటి ఆందోళన పరిస్థితులు లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పెట్రోల్ పంపు యజమానులకు సూచించారు. ఈ సమావేశంలో పౌర సరఫరా శాఖ అధికారి రమేష్, ఆయిల్ కంపెనీ సెల్స్ ప్రతినిధులు ప్రణీత్, సౌమ్యదీప్, హరీష్ రాజ్, పెట్రోల్, డీజిల్, డీలర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అధ్వానంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు





**రోడ్లపైనే మొక్కజొన్న బస్తాలు**

**?రైతుల కష్టాలను పట్టించుకోరా..?**

**బీజేపీ మండల అధ్యక్షుడు విష్ణు యాదవ్ ధ్వజం**

కొత్తపల్లి గోరి, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కేంద్రం నిర్వహణ తీరుపై బీజేపీ మండల అధ్యక్షుడు సూదనబోయిన విష్ణు యాదవ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే, వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయన ఆరోపించారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట**

కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు లేవని, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విష్ణు యాదవ్ పేర్కొన్నారు. సౌకర్యాల కొరత: మొక్కజొన్న బస్తాలను భద్రపరిచేందుకు సరైన స్థలం లేకపోవడంతో రైతులు ప్రధాన రహదారిపైనే బస్తాలను వేయాల్సి వస్తోంది.లారీల కొరత: పంటను తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడం వల్ల కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయింది. ?ప్రమాదాల పొంచి: రాత్రి వేళల్లో రహదారిపై నిల్వ ఉంచిన బస్తాల వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**ఎకరానికి 40 క్వింటాళ్లు పండితే.. 26 క్వింటాళ్లే కొంటారా**ప్రభుత్వ నిబంధనలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు ఎకరానికి సుమారు 40 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధిస్తుంటే, ప్రభుత్వం కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామనడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. మిగిలిన పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ఆయన ప్రశ్నించారు.

**తక్షణమే చర్యలు తీసుకోవాలి**

ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి, తక్షణమే లారీలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా పండించిన పూర్తి పంటను కొనుగోలు చేసి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి



దామెర, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): మంగళవారం దామెర మండల కేంద్రంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజలు గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు.సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం మాయుచర్ ఉండాలి అని అన్నారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని,రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు

## సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని సందర్శించిన ఎయిమ్స్ సీనియర్ వైద్యులు



ములుగు జిల్లా, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, ములుగు ను అయిమ్స్ హైదరాబాద్ సీనియర్ వైద్యులు సందర్శించి, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధి మరియు ఆరోగ్య సేవల మెరుగుదలకు యూనివర్సిటీని నోడల్ కేంద్రంగా చేసుకుని పలు కార్యక్రమాలను ప్రారంభించాలని అయిమ్స్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనల్లో మెడికల్ సైన్సెస్‌లో సర్టిఫికేట్ కోర్సులను ప్రారంభించడం కూడా ముఖ్యాంశంగా ఉంది. త్వరలోనే అయిమ్స్ హైదరాబాద్ మరియు సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మధ్య పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదిరే అవకాశం ఉంది అని వారు తెలియ చెయ్యడం జరిగింది.

## విద్యార్థుల పోస్ట్ కార్డు ఉద్యమం





భూపాలపల్లి ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

నిర్వహిస్తున్నటువంటి ఫీజు రియంబర్స్ మెంట్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా బిఆర్ఎస్వి కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రైవేటు రంగ డిగ్రీ కళాశాలలు, హాస్టల్స్ తిరుగుతూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పెండింగ్లో ఉన్నటువంటి 8వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బాకీలు చెల్లించే విధంగా చూడాలని విద్యార్థులు పోస్ట్ కార్డు పై రాయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా విద్యార్థి నాయకులు కొల్లోజు దిలీప్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియాంబర్స్ మెంట్ చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేయాలి. విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల పై తరగతులకు వెళ్లడానికి, అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం జరుగుతుంది. 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వెంటనే ఫీజు రియంబర్స్ మెంట్ విధులను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవలసిందిగా కోరడం జరుగుతుంది. లేని పక్షాన ఈ యొక్క కార్యక్రమాన్ని మరింత ఉదృతంగా ముందుకు తీసుకెళ్తామని అలాగే రేపు నిర్వహించే ప్రభుత్వ మరియు ప్రైవేటు డిగ్రీ కళాశాల వృత్తి విద్య సంస్థలు బంద్ కు మద్దతు ఇవ్వాల్సిందిగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం పక్షాన కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్వి నాయకులు భూక్య హరీష్ నాయక్, కత్తి వినయ్ గౌడ్, నరసింహ, రాజు, మహేష్, ప్రశాంత్, అఖిల్, ఎండి సమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

## కౌలు కార్డులపై రైతులకు అవగాహన కార్యక్రమం

**మద్దికేర:** మద్దికేర మండలంలోని పరిధిలోని గల బసనేపల్లి,హంప రెవెన్యూ గ్రామాల్లో కౌలు రైతుల కార్డుపై మంగళవారం రోజున వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి రవి మాట్లాడుతూ కౌలు రైతు కార్డు పొందడం వలన సాగుదారులకు ప్రభుత్వం నుండి వచ్చే అన్ని ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలియజేశారు.ఈ కార్డుల వలన భూ యజమానులకు ఎటువంటి నష్టం వాటిల్లదని రైతులకు ఆయన భరోసా కల్పించారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పీఎండిఎస్ విధానంలో విత్తనాలను వెదజల్లుకోవడం వలన తొలకరిలో కురిసే వర్షాలకు పంటలు మొలకెత్తి రైతులకు కావలసిన మేత,భూమి భూసారం పెరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ సంవత్సరం ఎల్నినో ప్రభావం వలన తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని, కనుక రైతులందరూ వర్షభావ పరిస్థితులు ఎదుర్కొనే విధంగా తక్కువ తేమ అవసరం అయ్యే పంటలు మరియు రకాలు సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు.

# జిల్లాలో పెట్రోలు, డీజిల్ కొరత లేదు

**కొరత అంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు**

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**



హనుమకొండ జిల్లా, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): జిల్లాలో పెట్రోలు, డీజిల్ ఇంధన కొరత లేదని, వివిధ పెట్రోలియం సంస్థల ద్వారా డీజిల్, పెట్రోలు నిల్వలు అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు ఆందోళన చెందవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలో పెట్రోలు, డీజిల్ సరఫరాపై పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎనర్జీ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పెట్రోలియం సంస్థల పెట్రోలు, డీజిల్ నిల్వలు గురించిన వివరాలను ఆయా సంస్థల ప్రతినిధులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో పెట్రోలు డీజిల్ కొరత లేనప్పటికీ పెట్రోల్ బంకుల్లో డీజిల్ పెట్రోల్ కొరకు క్యూలైన్లో ఉంటున్నారని పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ కొరత అంటూ అసత్య ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని అన్నారు. పెట్రోల్ బంకుల్లో క్యూ లో ఉన్న వాహనదారులకు పెట్రోల్, డీజిల్ పోయాలని అన్నారు. అర్బన్ ప్రాంతంలో బాటిళ్లు, క్యాన్లలో పోయడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ డీజిల్ కోసం వచ్చే వాహనాల వారికి ప్రాధాన్యత ఇచ్చి పెట్రోల్, డీజిల్ పోయాలన్నారు. జిల్లాలో పెట్రోలు, డీజిల్ కు ఎలాంటి కొరత లేదని, కొరత అంటూ జరుగుతున్న అసత్య ప్రచారాన్ని పెట్రోలియం సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎండి వాజీద్ అలీ, జిల్లా రవాణా శాఖ అధికారి వేణుగోపాల్, డి డబ్ల్యు ఓ విశ్వజ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ప్రేమకళా, ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్, భారత్ పెట్రోలియం సేల్స్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# లండన్‌లో ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

**గులాబీ జెండా – కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష**

**బీఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు ఎన్నారైలు**

**ఎన్నారై బీఆర్ఎస్ నాయకులు అనిల్ కూర్మాచలం & నవీన్ రెడ్డి**



బీఆర్ఎస్ పార్టీ 26వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా లండన్ లో ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించి గులాబీ జెండా పండుగ నిర్వహించి, అమరవీరులకు, జయశంకర్ సర్ ని స్మరించుకొని నివాళుర్పించి, ఎన్నారైలంతా జై తెలంగాణ.. జై బీఆర్ఎస్.. జై కేసీఆర్.. జై జై కేసీఆర్ నినాదాలతో మార్మోగించారు. అనంతరం కేక్ కట్ చేసి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలను ప్రారంభించారు. యూకే లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎందరో తెలంగాణ ఎన్నారైలు, ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారీగా తెలంగాణ ఎన్నారైలు పార్టీలో చేరినట్టు సంయుక్త కార్యదర్శి నవీన్ మాదిరెడ్డి తెలిపారు.

కేసీఆర్ – కేటీఆర్ గార్ల నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో పార్టీలో చేరుతున్నామని, అలాగే తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ గారి నాయకత్వమే శ్రీరామ రక్షా అని భావిస్తున్నట్టు ఎన్నారైలు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా క్షేత్రస్థాయిలో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తలకు నాయకులకు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

మన ఇంటి పార్టీ మన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి , పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో దేశంలోనే మన రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టిన బీఆర్ఎస్ పార్టీని మనం కాపాడుకోవాలని, కెసిఆర్ నాయకత్వమే మనకు శ్రీరామ రక్షా అని ఎన్నారై బీఆర్ఎస్ యూకే కమ్యూనిటీ అఫైర్స్ చైర్ పర్సన్ రమేష్ ఎసెంపల్లి తెలిపారు.

నాటి ఉద్యమం నుండి నేటి వరకు లండన్ నుండి ప్రత్యేక కార్యాచరణతో అనుక్షణం పార్టీ వెంట ఉన్నామని, అవకాశం కల్పించిన కేసీఆర్ గారికి, కేటీఆర్ గారికి ఇతర పార్టీ పెద్దలకు కార్యదర్శి సురేష్ గోపతి కృతజ్ఞతలు తెలిపారు.


26 సంవత్సరాల గులాబీ పండగ వేళ అన్ని సందర్భాల్లో పార్టీ వెంట ఉన్న ప్రతీ కార్యకర్తలకు, అలాగే లండన్ లో మమ్మల్ని ప్రోత్సహించి నడిపించిన ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం గారికి, ప్రతీ ఎన్నారై బీఆర్ఎస్ బాధ్యులకు సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ కటికనేని కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో మళ్ళీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చే వరకు కేసీఆర్ గారిని ముఖ్యమంత్రిని చేసే వరకు అలుపెరగకుండా పోరాటం చేస్తామని కార్యదర్శి అబ్దుల్ జాఫర్ తెలిపారు.

రాబోయే తరాలకు బీఆర్ఎస్ పార్టీ చరిత్రను, కేసీఆర్ గారి పోరాటాన్ని తెలియజేసేలా కృషి చేస్తామని, యువతరమంతా కేసీఆర్ – కేటీఆర్ గార్ల నాయకత్వాన్ని కోరుకుంటుందని, పార్టీ బలపర్చడానికి ఎన్నారై బీఆర్ఎస్ యూకే యువజన విభాగం ప్రత్యేకంగా కృషి చేస్తుందని సంయుక్త కార్యదర్శి అబ్దుల్ ఖుదూస్ తెలిపారు.

తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ గారి నాయకత్వమే శ్రీరామ రక్షా, తెలంగాణ ప్రజల కోసం పని చేసేది, అన్ని సందర్భాల్లో తెలంగాణ ప్రజల పక్షాన నిలిచింది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని, బీఆర్ఎస్ పార్టీని కెసిఆర్ గారి నాయకత్వాన్ని నమ్మిన ప్రజలకు మేలే జరిగిందని కాబట్టి మనమంతా కేసీఆర్ గారి వెంటే ఉండాలని, ఎన్నారైలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని ఏన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం తెలిపారు.

# చంపాపేట లో ఎంపి ఈటల పర్యటన



**హైదరాబాద్** చంపాపేట్ డివిజన్ లో కాలనీ సమస్యలను పరిశీలించి, పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఎంపి ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపి మాట్లాడుతూ సాయి నగర్ మద్దెల చెరువు ఒక మురికి కూపం లాగా ఉండేది. ఈ ప్రాంతంలో ఉన్న డ్రైనేజ్ అంత ఇక్కడే నిల్వ ఉండి, ఈగలు, కంపు వాసన, చుట్టుపక్కల ఎక్కడ బోరు వేసినా పొల్యూటెడ్ వాటర్ తో సతమతమవుతున్నారాని దివంగత నేత వంగ మధు గారు మంచినీళ్ల చెరువుగా చేయాలని ప్రయత్నం చేసి కోటి రూపాయలతో డ్రైనేజీ పైప్ లైన్ వేయించారు. కానీ శుభ్రపరిచే వాళ్ళు లేక పైపు కెపాసిటీ సరిపోక ఎక్స్ట్రా ఆయన నీరంతా కూడా చెరువులోకి పోయి మళ్ళీ మురికి కూపం లాగా మిగిలిపోయింది. దీని ప్రక్షాళన కోసం మురికి నీరు చెరువులోకి రాకుండా ఉండటం కోసం, అవసరమైతే ఇంకో పైప్లైన్ వేసి దాని కెపాసిటీ పెంచుతామని అన్నారు. చెరువు దగ్గర జులాయిల, పోకిరిల అడ్డాగా మారిపోయింది. ఇది మాదకద్రవ్యాలకు అడ్డాగా కాకుండా ఉండాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాము. చెరువు చుట్టూ ఫెన్సింగ్ కూడా వేయించాలని కోరారు. దానిపై నేను అధికారులతో మాట్లాడి వేయించే ఏర్పాటు చేస్తానని హామీ ఇస్తున్నాను. ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే రాజకీయాల, ఫోటోల, ఆధిపత్యం కోసం పాకులాడే వాళ్ళని చూస్తున్నాం. ప్రజలకు ఎవరు ఏం చేస్తారో గమనిస్తూనే ఉన్నారు. ఈ ప్రాంత ప్రజలు నా దగ్గరకు వచ్చి కంప్లైంట్ చేస్తే నేను పరిశీలిస్తానని చెప్పాను ఇప్పుడు వచ్చి పరిశీలిస్తున్నాను. దీనికి ఏమేమి పనులు పెండింగ్ ఉన్నాయో అవన్నీ చేసే ప్రయత్నం చేస్తానని అన్నారు. హైదరాబాదులో ఎక్కడ చూసినా ఏదో ఒక మూలన పైప్ లైన్ కోసం తవ్వుతూనే ఉంటారు. వేగంగా పెరుగుతున్న సిటీకి అనుగుణంగా పైప్లైన్ కెపాసిటీ ఉండాలి. మెగా ఫంక్షన్ హాల్ దగ్గర దివంగత నేత వంగ మధు గారి ప్రోత్బలం, నేను లెటర్ పెట్టి 6 కోట్ల రూపాయలతో కొత్త బాక్స్ డ్రైనేజీ కట్టడం జరుగుతుంది. దాన్ని కూడా అధికారులతో మాట్లాడి సకాలంలో పూర్తయ్యే ప్రయత్నం చేస్తాను. కార్పొరేటర్ల కాల పరిమితి అయిపోతున్నప్పుడే చెప్పినం... ఎంతోమంది కార్పొరేటర్లు నిత్యం ప్రజల మధ్యలో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవడం కష్టం ఉంది వారంతా దిగిపోయారు కాబట్టి మీరు స్పెషల్ ఆఫీసర్లు గంట, రెండు గంటలు గాని ఈ ప్రాంతంలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలి కానీ ఎక్కడ జరుగుతున్నట్టు కనిపించడం లేదు. మాలాంటివారు ఈ ప్రాంతాల్లో తిరిగి ఈ పనుల పర్యవేక్షణ చేసి, ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను పై తప్పకుండా దృష్టి పెడతామని అన్నారు.

## డ్రగ్స్‌కు నో పిల్లల భద్రతపై కలెక్టర్ సత్య శారది లుపులి



వరంగల్ జిల్లా, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా "పిల్లల భద్రత మరియు రక్షణ -- డ్రగ్స్‌కు నో చెప్పండి" అవగాహన కార్యక్రమం వర్ధన్నపేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మున్సిపల్ చైర్ పర్సన్ పాలకుర్తి సారంగపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తు అని, వారిని మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై నిరంతరం పర్యవేక్షణ కలిగి ఉండాలని, వారి ప్రవర్తనలో మార్పులను గమనించి సమయానికి సరైన మార్గదర్శనం చేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాలల రక్షణకు కట్టుబడి ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రమాణం చేయించడంతో పాటు "డ్రగ్స్‌కు నో" సందేశంతో ర్యాలీ నిర్వహించారు. యువతకు మత్తు పదార్థాల ప్రమాదాలపై విపులంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, తహసీల్దార్ విజయ్ సాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా, ఎంపీడీఓ వెంకటరామణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఉమా, పోలీస్, విద్యాశాఖ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో పర్యటించిన ఎయిర్పోర్ట్ అథారిటీ అధికారులు



వరంగల్ జిల్లా, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రెండు రోజుల పర్యటనలో భాగంగా జిల్లాలో పర్యటించారు. ఈ బృందంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ,అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం ఈడీ ఎస్.కె. గుప్తా, జై గౌరవ్ చౌదరి, జేజీఎం బాలేందర్ కుమార్ తివారి, కేజీఎం గోపాలకృష్ణలు కలిసి మామునూరు విమానాశ్రయానికి ప్రత్యేక డిజైన్ రూపకల్పనలో భాగంగా మంగళవారం మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా పద్మకోటలోని కీర్తి తోరణం, ఏకశిల గుట్టలోని స్వయంభూ దేవాలయం, రాతి మట్టి కట్టడాలను సందర్శించారు. కాకతీయుల శిల్పకళా వైభవాన్ని తిలకించిన అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను కూడా పరిశీలించారు. ఈ సందర్శనలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయాలి

**పెట్రోల్ బంక్ లలో నిల్వలను పరిశీలించి నివేదికలను అందించండి**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ జిల్లా, ఏప్రిల్ 28 (తీన్మార్ న్యూస్): ప్రజలు అపోహలకు లోను కాకుండా, సాధారణ అవసరాలకు మాత్రమే ఇంధనం (పెట్రోల్, డీజిల్) కొనుగోలు చేయాలని, అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో తనిఖీ లు నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. జిల్లాలో ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వల అంశం మీద మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో మినీ కాన్ఫరెన్స్ హల్ లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్నీ బంకుల్లో తహసీల్దార్, సివిల్ సప్లై, పోలీస్, లీగల్ మెట్రాలాజి శాఖల అధికారులు జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి ఉన్న నిల్వలని పరిశీలించాలన్నారు. పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ స్టాక్ లేదని బోర్డు పెట్టిన బంక్ యజమానుల మీద చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోల్ బంకుల్లో సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తూ ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఎక్కడైనా పెట్రోల్, డీజిల్ కొరత ఉంటే 1800 425 00 333 టోల్ ఫ్రీ నెంబర్ కి అలాగే రాష్ట్ర విపత్తుల హెల్ప్ లైన్ 1077 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు ముందస్తు గా క్యాన్ లలో ఎక్కువ మొత్తం లో పెట్రోల్, డీజిల్ ని తీసుకెళ్ళకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, జనగాం, స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో లు గోపిరామ్, వెంకన్న, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ, ఆరోగ్య, విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులు, పెట్రోల్ బంక్ డీలర్లు పాల్గొన్నారు

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి...

**కొలిమిగుండ్ల ఏప్రిల్ 28** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి నరసింహ స్వామి తిరుణాల సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రాయలసీమ స్థాయి క్రికెట్ పోటీలను టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి నాయకులు కార్యకర్తలు, కమిటీ సభ్యులు, బహుమతి ఇస్తున్న దాతలతో కలిసి ఘనంగా ప్రారంభించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరుణాల సందర్భంగా క్రికెట్ పోటీలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని మూలే రామేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో లోకేపల్లె మధు ప్రసాద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి,ఎద్దుల వెంకటేష్, డాక్టర్ కిరణ్ కుమార్, నరసింహులు, నాగ కుళాయి, రవికుమార్, చంద్ర, వెంకటరాముడు ఇంకా తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజినెస్

### అనిల్ అంబానీ మరో 3 వేల కోట్ల ఆస్తుల జప్తు



**న్యూఢిల్లీ :** అనిల్ అంబానీకి చెందిన మరో రూ.3 వేల కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ). బ్యాంకులను మోసం చేసిన కేసులో మనీలాండరింగ్ జరిగిందంటూ ఆరోపిస్తున్న ఈడీ.. తాజాగా అనిల్ అంబానీ, ఆయన కుమారుడు అన్మొల్ అంబానీలకు చెందిన రూ.3,034 కోట్ల విలువైన ఖాందాల ఫామ్‌హౌస్‌ను జప్తు చేసినట్టు ఈడీ వర్గాలు వెల్లడించాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద ఆస్తులను దుర్వినియోగం చేయడంతోపాటు బ్యాంకులను మోసం చేసిన కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేస్తున్నది. దీనిపై అడాగ్ ప్రతినిధి మాట్లాడుతూ..అనిల్ అంబానీ తల్లి కోకిలాబెన్ డీ అంబానీ ఆస్తులను కూడా జప్తు చేశారని పేర్కొన్నారు.ఆర్‌కామ్‌కు వ్యతిరేకంగా ఎస్బీఐ, పీఎన్‌బీ, బీవోబీ, ఎల్ఐసీలు నమోదు చేసిన కేసులపై ఇప్పటికే సీబీఐ ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది.

### తగ్గిన పసిడి ధరలు



**న్యూఢిల్లీ :** పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వచ్చిన పుత్తడి, వెండి ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడంతోపాటు క్రూడాయిల్, డాలర్ మరింత బలోపేతం కావడం ధరలు దిగువముఖం పట్టాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,800 తగ్గి రూ.1.54 లక్షలకు దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.1.56 లక్షలుగా ఉన్నది. పసిడితోపాటు వెండి ధర రూ.6,500 లేదా 3 శాతం తగ్గి రూ.2.44 లక్షల దిగువకు పడిపోయింది. బంగారం ధరలు మూడు వారాల కనిష్ఠ స్థాయికి పడిపోయినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 95.37 డాలర్లు లేదా 2 శాతం తగ్గి 4,586.50 డాలర్లకు పడిపోగా, వెండి 73 డాలర్లకు దిగొచ్చింది.

# మార్కెట్లకు చమురు దెబ్బ..

## సెన్సెక్స్ 417, నిఫ్టీ 97 పాయింట్లు డౌన్



**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. వరుసగా 3 రోజులపాటు క్షీణించిన సూచీలు.. సోమవారం కోలుకున్న విషయం తెలిసిందే. అయితే మంగళవారం తిరిగి పతనమయ్యాయి. భౌగోళిక–రాజకీయ అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగడం, భారతీయ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు తరలిపోవడం.. కొనుగోలు సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఉదయం ట్రేడింగ్ మొదలైన దగ్గర్నుంచి మదుపర్లు అమ్మకాల ఒత్తిడినే ఎదుర్కొన్నారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 416.72 పాయింట్లు లేదా 0.54 శాతం దిగజారి 76,886.91 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 562.57 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ 97 పాయింట్లు లేదా 0.40 శాతం నష్టపోయి 23,995.70 దగ్గర నిలిచింది. హెవీ వెయిట్ షేర్ మారుతీ సుజుకీ బీఎస్ఈలో 2.53 శాతం క్షీణతతో రూ.12,891. 70 వద్ద స్థిరపడింది. జనవరి–మార్చి త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం 6.45 శాతం పడిపోవడమే కారణం.

**నష్టాల్లో బ్యాంకింగ్, ఏవియేషన్ షేర్లు**

విమానయాన, బ్యాంకింగ్ రంగాల షేర్లకు మదుపర్లు దూరం జరిగారు. పెరుగుతున్న ఇంధన ధరల మధ్య కార్యకలాపాలు నడుపలేని దుస్థితిలో ఉన్నామని దేశీయ ప్రధాన ఎయిర్‌లైన్స్ కేంద్ర ప్రభుత్వానికి చెప్పడం.. షేర్ల కొనుగోలు అవకాశాలను దెబ్బతీశాయి. ఈ క్రమంలోనే స్పైస్‌జెట్ షేర్ విలువ బీఎస్ఈలో 4.96 శాతం దిగజారి రూ.14 వద్ద ముగిసింది. ఇండిగో షేర్ విలువ కూడా 2.59 శాతం పడిపోయి రూ.4,445.10 వద్ద ఆగింది. మరోవైపు నిబంధనల కఠినతరం అంచనాల నడుమ బ్యాంకింగ్ షేర్లూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.

**53 పైసలు క్షీణించిన రూపీ విలువ**

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మంగళవారం భారీగా క్షీణించింది. ఈ ఒక్కరోజే 53 పైసలు దిగజారింది. ఫలితంగా 94.68 వద్ద స్థిరపడింది. కాగా, పెరుగుతున్న ముడి చమురు ధరలు, వెనుకకుపోతున్న విదేశీ పెట్టుబడులు.. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్‌ను పెంచాయని తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు.

# మారుతి లాభంలో క్షీణత

### క్యూ4లో 6 శాతం తగ్గిన ప్రాఫిట్

### రూ.140 డివిడెండ్ ప్రకటించిన సంస్థ




**న్యూఢిల్లీ :** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,659 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,911 కోట్ల లాభంతో పోలిస్తే 6.45 శాతం తగ్గింది. గత త్రైమాసికంలో రికార్డు స్థాయిలో వాహన విక్రయాలు జరిపినప్పటికీ మార్కెట్ టూ మార్కెట్ ప్రభావంతో లాభాల్లో కోత పడిందని పేర్కొంది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 28.2 శాతం ఎగబాకి రూ.40,920 కోట్ల నుంచి రూ.52,462.5 కోట్లకు ఎగబాకినట్టు వెల్లడించింది. మరోవైపు, గత త్రైమాసికంలో సంస్థ మరో చరిత్రను సృష్టించింది. కంపెనీ చరిత్రలో తొలిసారిగా ఒక త్రైమాసికంలో రూ.50 వేల కోట్ల విలువైన విక్రయాలు జరుపడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా సమావేశమైన కంపెనీ బోర్డు గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతిషేరుకూ రూ.140 డివిడెండ్‌ను ప్రకటించింది. కిందటేడాది ప్రకటించిన రూ.135 కంటే ఇది అధికం.

గత త్రైమాసికంలో సంస్థ నిర్వహణ ఖర్చులు రూ.37,585.5 కోట్ల నుంచి రూ.48,125.3 కోట్లకు పెరిగాయి.

నాలుగో త్రైమాసికంలో సంస్థ 6,76,209 యూనిట్ల వాహన విక్రయాలు జరిపింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 11.8 శాతం పెరిగాయి.

2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,83,316 కోట్ల ఆదాయంపై రూ.14,679.5 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 24,22,713 యూనిట్ల వాహనాలను విక్రయించింది. వీటిలో దేశీయంగా 19,74,939 యూనిట్లను విక్రయించగా..4,47,774 యూనిట్ల వాహనాలను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.14 వేల కోట్లు పెట్టుబడులు పెట్టబోతున్నట్టు ప్రకటించింది.

# ఫెరియెరా ఊచకోత..

## పంజాబ్‌కు ఓటమి రుచి చూపించిన రాజస్థాన్



19.2 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయవంతంగా


ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో దూసుకుపోతూ, ఏకైక అజేయ జట్టుగా చలామణి అవుతున్న పంజాబ్ కింగ్స్‌కు రాజస్థాన్ రాయల్స్ ఓటమి రుచి చూపించింది. సొంతగడ్డ ముల్లాన్‌పూర్ వేదికగా ఇవాళ జరిగిన మ్యాచ్‌లో పంజాబ్‌పై రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఆఖర్లో స్టోయినిస్ (22 బంతుల్లో 62 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్సర్లు) ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోశాడు. ముఖ్యంగా బ్రిజేష్ శర్మ వేసిన చివరి ఓవర్‌లో స్టోయినిస్ పూనకం వచ్చినట్లు ఊగిపోయాడు. ఆ ఓవర్‌లో వరుసగా 4, 6, 6, 4, 4 సాధించాడు. అంతకుముందు ప్రభ్‌సిమ్రన్ (59) అర్ధ సెంచరీతో రాణించాడు. మిగతా పంజాబ్ ఆటగాళ్లలో ప్రియాంశ్ ఆర్య (29), కూపర్ కన్నోల్లీ (30), శ్రేయస్ అయ్యర్ (30) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. రాయల్స్ బౌలర్లలో యశ్ రాజ్ పుంజా 2, ఆర్చర్, బర్గర్ తలో వికెట్ తీశారు. అనంతరం 223 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 19.2 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయవంతంగా ఛేదించింది. డొనోవన్ ఫెరియెరా (52 నాటౌట్), షుభమ్ దూబె (31 నాటౌట్) ఊచకోత కోసి రాయల్స్‌ను విజయతీరాలకు చేర్చారు. అంతకుముందు యశస్వి జైస్వాల్ (51), వైభవ్ సూర్యవంశీ (43) తమ సహజశైలిలో రెచ్చిపోయి రాయల్స్ గెలుపుకు గట్టి పునాది వేశారు. ఆతర్వాత వచ్చిన ధృవ్ జురెల్ (16) కాస్త తడబడినప్పటికీ.. అతని తర్వాత వచ్చిన రియాన్ పరాగ్ (29) ఓ మోస్తరు ఇన్నింగ్స్ ఆడాడు. ఇతని తర్వాత క్రీజ్‌లో కుదురుకున్న ఫెరియెరా, షుభమ్ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడి తమ జట్టును విజయతీరాలకు చేర్చారు. పంజాబ్ బౌలర్లలో చహల్ 3, అర్షదీప్ ఓ వికెట్ తీశారు.

### చైనా చేతిలో చిత్తుగా ఓడి..
### ఊబర్ కప్‌లో ముగిసిన భారత్ కథ



**హార్సెన్స్ (డెన్మార్క్):** ఊబర్ కప్‌లో భారత కథ ముగిసింది. గ్రూప్–ఏలో ఆడిన మూడు మ్యాచ్‌లకు గాను రెండింట్లో ఓడిన భారత్.. ఈ టోర్నీ నుంచి గ్రూప్ దశ లోనే వైదొలిగింది. గ్రూప్ స్టేజ్‌లో చైనాతో జరిగిన ఆఖరి పోరులో భారత మహిళా షట్లర్లు 0–5తో దారుణంగా ఓడారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు మినహా మిగిలిన షట్లర్లలో ఎవరూ చైనా క్రీడాకారిణుల జోరు ముందు తేలిపోయారు. ఈ టోర్నీలో 16 సార్లు విజేత అయిన చైనా చేతిలో ఓడిపోవడం భారత్‌కు ఇది వరుసగా మూడోసారి. సింగిల్స్ విభాగాల్లో పీవీ సింధు.. 16–21, 21–19, 19–21తో ప్రపంచ రెండో నంబర్ షట్లర్ వాంగ్ జియి చేతిలో పోరాడి ఓడింది. దేవికా.. 21–19, 17–21, 10–27తో జు వెన్ జింగ్ జోరుకు చిత్తవగా ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యుఫీ 22–20, 21–13తో ఇషారాణిని మట్టికరిపించింది. డబుల్స్‌లో ప్రియా–శృతి ద్వయం.. 11–21, 8–21తో వరల్డ్ నంబర్ వన్ జోడీ లియు షెంగ్ షు, టాన్ నింగ్‌కు కనీస పోటీనివ్వలేకపోయారు. రెండో డబుల్స్‌లో తనీషా–కవిప్రియ జోడీ.. 10–21, 21–12, 19–21తో లువొ జు మిన్–జాంగ్ షు జియాన్‌ను చేతిలో ఖంగుతింది. గ్రూప్–ఏలో చైనా, ఆతిత్య డెన్మార్క్ టాప్–2లో నిలిచి క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా భారత్, ఉక్రెయిన్ నిష్క్రమించాయి.

### క్వార్టర్స్‌కు సబలెంకా, సిన్నర్




**మ్యాడ్రిడ్:** ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న మ్యాడ్రిడ్ ఓపెన్‌లో టాప్ టెన్నిస్ ప్లేయర్లు అరీనా సబలెంకా, యానిక్ సిన్నర్ క్వార్టర్స్ చేరారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ నంబర్ వన్ సబలెంకా.. 6–7 (1/7), 6–3, 6–2తో నవొమి ఒసాకా (జపాన్)ను ఓడించింది. కానీ మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా).. 4–6, 6–1, 5–7 (5/7)తో నొస్కొవ (చెక్ రిపబ్లిక్) చేతిలో ఓడింది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా ఓపెన్ గెలిచిన ఎలీనా రిబాకినా (కజకిస్థాన్) సైతం.. 6–7 (8/10), 4–6తో పొటపొవ (ఆస్ట్రియా) జోరుకు తలవంచింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ).. 6–2, 7–5తో కామెరూన్ నూరీ (బ్రిటన్)పై అవలీల విజయం సాధించి క్వార్టర్స్ చేరగా రెండో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ).. 6–3, 7–6 (7/2)తో టెరెన్స్ అట్మనె (ఫ్రాన్స్) పై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు ప్రవేశించాడు.

## స్పోర్ట్స్

### విధ్వంసకర శతకం..
### చరిత్ర సృష్టించిన బాబర్ ఆజమ్



ప్రస్తుతం జరుగుతున్న పాకిస్తాన్ సూపర్ లీగ్ 2026లో ఆ దేశ స్టార్ బ్యాటర్, పెషావర్ జల్మీ కెప్టెన్ బాబర్ ఆజమ్ అరివీర భయంకర ఫామ్‌లో ఉన్నాడు. ఈ టోర్నీలో ఇప్పటికే ఓ సెంచరీ, 3 అర్ధ సెంచరీలు చేసిన అతను.. ఇవాళ (ఏప్రిల్ 28) మరో సెంచరీ బాదాడు. ఇస్లామాబాద్ యునైటెడ్‌తో జరుగుతున్న క్వాలిఫయర్ మ్యాచ్‌లో బాబర్ ఉగ్రరూపం దాల్చాడు. 59 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 103 పరుగులు చేశాడు. ఫలితంగా అతని జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోర్ చేసింది. మిగతా పెషావర్ బ్యాటర్లలో మొహమ్మద్ హరీస్ (35), కుసాల్ మెండిస్ (41), ఆరోన్ హార్డీ (20) ఓ మోస్తరు స్కోర్లు చేయగా.. బ్రేస్‌వెల్ (2), అబ్దుల్ సమద్ (0), ఫర్హాన్ (0) నిరాశపరిచారు. ఇస్లామాబాద్ బౌలర్లలో షాదాబ్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టగా.. రిచర్డ్ గ్లీసన్ 2, సల్మాన్ మీర్జా, ఫహీమ్ అష్రాఫ్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. ఇదిలా ఉంటే, ఈ సెంచరీతో బాబర్ ఓ ఆల్‌టైమ్ పీఎస్ఎల్ రికార్డు నెలకొల్పి చరిత్ర సృష్టించాడు. ఈ లీగ్ చరిత్రలో నాలుగు సీజన్లలో (2021, 2023, 2024, 2026) 500 ప్లస్ పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఈ రికార్డుకు సంబంధించి బాబర్ తర్వాతి స్థానంలో మొహమ్మద్ రిజ్వాన్ ఉన్నాడు. రిజ్వాన్ పీఎస్ఎల్‌లో మూడు సీజన్లలో (2021, 2022, 2023) 500 ప్లస్ పరుగులు సాధించాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన బాబర్ 598 పరుగులు చేసి, పీఎస్ఎల్ చరిత్రలో ఓ సింగిల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగానూ చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ రికార్డు లాహోర్ ఖలందర్స్ ప్లేయర్ ఫకర్ జమాన్ పేరిట ఉండేది. జమాన్ 2022 ఎడిషన్‌లో 588 పరుగులు చేశాడు.




# గెటప్ రెడీ.. ఇక మిగిలింది యాక్షనే!

అగ్ర కథానాయకుడు చిరంజీవి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ ఓ చిత్రాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని చిరంజీవి పాత్రకు సంబంధించిన లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తయింది. ఇందులో మెగాస్టార్ పవర్‌ఫుల్, స్ట్రైకింగ్ లుక్‌లో కనిపిస్తారని లుక్ టెస్ట్‌ని బట్టి అర్థమవుతున్నది. ఇప్పటికే విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. బ్లాక్‌బస్టర్ 'వాల్తేరు వీరయ్య' తర్వాత చిరంజీవి-బాబీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ రెండో చిత్రం మెగా అభిమానులకు విందు భోజనంలా ఉంటుందని సమాచారం. మాస్ ఎంటర్‌టైనర్స్ తీయడంలో సిద్ధహస్తుడైన బాబీ ఈసారి మెగాస్టార్ కోసం ఇంటెన్స్ క్యారెక్టర్‌ని డిజైన్ చేశారని, మెగాస్టార్ స్క్రీన్ ప్రెజెన్స్ మరింత ఎలివేట్ అయ్యేలా స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ముహూర్తం, రెగ్యులర్ షూటింగ్ వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటిస్తారు.



# అరుదైన గౌరవం



ప్రస్తుతం యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉంది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. కేరళలో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో పోరాట ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా త్వరలో రష్మిక మందన్న ఓ గ్లోబల్ ఈవెంట్‌లో సందడి చేయబోతున్నది. జపాన్‌లోని టోక్యోలో జరగనున్న గ్లోబల్ యానిమే అవార్డ్స్ వేడుకలో రష్మిక మందన్న ప్రజెంటర్‌గా వ్యవహరించనుంది. ప్రపంచవ్యాప్తంగా యానిమేషన్ రంగంలో అద్భుత ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన సాంకేతిక నిపుణులతో పాటు సినిమాలకు గత పదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. భారత్ నుంచి ఈ ఏడాది గ్లోబల్ యానిమే వేడుకలో పాల్గొంటున్న ఏకైక భారతీయ నటి రష్మిక మందన్న కావడం విశేషం. ఇదొక అరుదైన గౌరవమని అంటున్నారు. అయితే 2024లో జరిగిన గ్లోబల్ యానిమే ఈవెంట్‌లో కూడా రష్మిక మందన్న పాల్గొన్నది. ఈ వేడుకలో భాగమైన తొలి భారతీయురాలిగా ఆమె రికార్డు సృష్టించింది. మరోమారు రష్మిక మందన్న ఈ గ్లోబల్ ఈవెంట్‌లో పాల్గొనడం ప్రాధాన్యతను సంతరించుకుంది.




## బాలీవుడ్‌లో మైథలాజికల్ జంగిల్ డ్రామా?

తమిళ అగ్ర కథానాయకుడు ధనుష్ హీరోగా బాలీవుడ్‌లో ఓ మైథాలాజికల్ జంగిల్ డ్రామా తెరకెక్కనున్నది. కోలీవుడ్ ఫిల్మ్ మేకర్ పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి బాలీవుడ్ అగ్ర దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ నిర్మాత. ఈ ప్రాజెక్ట్‌కు హీరోగా ముందు రామ్‌చరణ్‌ను అనుకున్నారట. కొన్ని కారణాల వల్ల చర్చలు కార్యరూపం దాల్చకపోవడంతో ఈ సినిమా ధనుష్ కాంపౌండ్‌కు చేరిందంటూ బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. ఓ పౌరాణిక గాథ ఆధారంగా అటవీ నేపథ్యంలో ఈ కథ సాగుతుందట. దర్శకుడు పీఎస్ మిత్రన్ తమిళంలో తెరకెక్కించిన ఇరుంబు తిరై, సర్దార్ చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో పాటు భన్సాలీతో ఆయనకు ఉన్న అనుబంధం కారణంగా ఈ ప్రాజెక్ట్ మిత్రన్‌కి దక్కిందని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే రానున్నది.

# పుట్టినరోజు కానుకగా...

హీరో ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా తన అభిమానులకు ఓ కానుక ఇవ్వనున్నారు. మే 20న ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన హీరోగా నటించిన 'ఊసరవెల్లి' సినిమా రీ రిలీజ్ కానుంది. ఎన్టీఆర్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించిన చిత్రం 'ఊసరవెల్లి'. తమన్నా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో తనికెళ్ల భరణి, ప్రకాశ్‌రాజ్, విద్యుత్ జమాల్, సాయాజీ షిండే, మురళీ శర్మ తదితరులు ఇతరపాత్రలు పోషించారు. బి. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా 2011 అక్టోబరు 6న రిలీజ్ అయింది. ఈ మూవీకి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ప్లస్‌గా నిలిచింది. కాగా 'ఊసరవెల్లి' చిత్రం సుమారు పదిహేనేళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకుల ముందుకొస్తోంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ సినిమాని రీ రిలీజ్ చేస్తున్నారు. ఇక ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్‌నీల్' (వర్కింగ్ టైటిల్). ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2027 జూన్ 11న రిలీజ్ కానుంది.





# కింగ్ 100.. 'శివ' లుక్‌తో నాగార్జున

టాలీవుడ్ కింగ్ నాగార్జున తన వందో సినిమాను ఎంతో ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. తమిళ దర్శకుడు కార్తీక్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం పేదరికం నుంచి సంపన్నుడిగా ఎదిగిన ఫార్ములా కథతో సాగనుందని తెలుస్తోంది. ఇందులో నాగ్ ఒక షేడ్‌లో 25 ఏళ్ల యువకుడిలా కనిపించనున్నారని సమాచారం. దాని కోసం చిరంజీవి ఆచార్యలో, రజనీకాంత్ కూలీలో వాడిన అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నారట. అంటే దాదాపు శివ సినిమాలో నాగార్జున ఎలా కనిపించారో, అదే వింటేజ్ లుక్‌ను ఈ పాత్రలో మళ్లీ చూపించనున్నారు. ఆచార్య వచ్చిన సమయంలో ఈ టెక్నాలజీ ఖరీదైనది. కానీ ఇప్పుడు ఏఐ అందుబాటులోకి రావడంతో ఖర్చు తగ్గింది, దాంతో వాడకం చాలా సులభమైంది. ఇక దీంతో నాగార్జున వందో సినిమా మరింత ప్రత్యేకంగా మారే అవకాశం ఉంది. కాగా ఈ చిత్రంలో టబు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. నాగార్జున-టబు జంట 28 ఏళ్ల తర్వాత మళ్లీ తెరపై కనిపించనుంది. గతంలో వీరిద్దరూ నటించిన నిన్నే పెళ్లాడతా బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. చివరిగా వీరు ఆవిడా మా ఆవిడే చిత్రంలో నటించారు. ప్రస్తుతం టబు షూటింగ్‌లో పాల్గొంటున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే 75 శాతం పూర్తయింది. దసరా తర్వాత విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. అయితే టైటిల్ నుంచి రిలీజ్ డేట్ వరకు ఏదీ ఇప్పట్లో ప్రకటించే ఉద్దేశం లేదు. సినిమా పూర్తయిన తర్వాతే ప్రచారం మొదలుపెట్టాలని నాగ్ నిర్ణయించారు. ఇలా నాగార్జున తన వందో చిత్రంపై పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టారు.



# 'ఖల్‌నాయక్ రిటర్న్స్'లో ఐటెం సాంగ్

సంజయ్‌దత్ నటించిన కల్ట్‌క్లాసిక్ 'ఖల్ నాయక్' చిత్రానికి ఇటీవలే సీక్వెల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఖల్ నాయక్ రిటర్న్స్' పేరుతో ఇది తెరకెక్కనుంది. 'ఖల్ నాయక్'లోని 'చోలీ కే పీచే క్యా హై' పాట అప్పట్లో అత్యంత ప్రజాదరణ పొందింది. మాధురీ దీక్షిత్ నృత్యాలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. అదే సమయంలో ద్వందార్థాలతో కూడిన పాట ఇదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలావుండగా.. తాజా సీక్వెల్‌లో ఈ పాటను రీమిక్స్ చేయబోతున్నారట. ఇందులో తమన్నా నర్తించనుందని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే తమన్నా పలు చిత్రాల్లో ఐటెంసాంగ్స్ చేసిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం 'స్త్రీ-2' చిత్రంలో తమన్నా చేసిన 'ఆజ్ కి రాత్' ప్రత్యేక గీతం విశేష ఆదరణ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో 'ఖల్ నాయక్ రిటర్న్స్'లో ఆమె పేరునే పరిశీలిస్తున్నారని బాలీవుడ్ టాక్.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463